PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 165 సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 05 - ఆగష్టు - 2026 , వెల రూ.5/-

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత



- రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం
- వైసీపీలో చేరిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు
- గూడపాటిని పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామన్న జగన్

2

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

- లోక్‌సభలో కేంద్రం వెల్లడి



- గత రెండున్నరేళ్లలో ఏపీకి ప్రత్యేక సాయం
- గత వైసీపీ ప్రభుత్వం కంటే అధికంగా నిధులు సాధించిన కూటమి ప్రభుత్వం
- లోక్‌సభలో వైసీపీ ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారిక సమాధానం
- ఆర్థిక క్రమశిక్షణ, సమర్థవంతమైన అమలు వల్లే ఇది సాధ్యమైందన్న రాష్ట్ర ప్రభుత్వం
- మూలధన వ్యయం కోసం కేంద్రం 50 ఏళ్లకు వడ్డీలేని రుణాలు

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా ఆర్థిక చేయూత లభించింది. "రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం" (ఎస్ఏఎస్‌సీఐ) కింద గత రెండున్నరేళ్ల కాలంలోనే రాష్ట్రానికి రూ.19,619 కోట్లు అందాయని కేంద్ర ప్రభుత్వం మంగళవారం నాడు లోక్‌సభలో ప్రకటించింది. 2020 నుంచి 2024 మధ్య గత వైసీపీ ప్రభుత్వం .....

2

# అగాధం నుంచి అభివృద్ధి వైపు..

## ఏపీ ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు వివరణ
- గత రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు
- గత ప్రభుత్వ పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల బకాయిల చెల్లింపులకు చర్యలు
- రుణాల రీ-షెడ్యూల్ ద్వారా ప్రభుత్వానికి రూ.8,269 కోట్ల మేర ఆదా
- వైసీపీ పాలనలో రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల జీఎస్డీపీ నష్టపోయిందని వెల్లడి



**నేటి శుభోదయ, అమరావతి :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం నుంచి ప్రగతి పథం వైపు నడిపిస్తు న్నామని, గత రెండేళ్లలో తీసుకున్న పటిష్ట చర్యలతో రాష్ట్రం అగాధం నుంచి అభివృద్ధి వైపు ప్రయాణిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నష్టం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపట్టిన దిద్దుబాటు చర్యలను వివరిస్తూ ఆయన మంగళవారం 46 పేజీల 'ప్రోగ్రెస్ రిపోర్ట్'ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కాలంలో సంక్షే మానికి రూ.1,49,401 కోట్లు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,33,917 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.

2

## అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు

- సీఎం యోగి ఆదిత్యనాథ్



- అయోధ్య నిధుల దుర్వినియోగం కేసులో సాధువుల ప్రమేయం లేదని వెల్లడి
- సిట్ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందన్న ముఖ్యమంత్రి
- యూపీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే విపక్షాల కుట్ర అని ఆరోపణ

2

# ఇంటింటికీ టీడీపీ.. ఒక్కరోజే 3.03 లక్షల ఇళ్ల సందర్శన

- 9వ రోజుకు చేరిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం
- ఇప్పటివరకు 23.63 లక్షల ఇళ్లను సందర్శించిన కూటమి శ్రేణులు
- రెండేళ్ల పాలన విజయాలు, సూపర్ సిక్స్ హామీల అమలుపై ప్రచారం
- ఇంఛార్జ్ మంత్రులు జిల్లాల్లో పర్యటించాలని లోకేష్ ఆదేశాలు

**నేటి శుభోదయ, అమరావతి :** కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసా గుతోంది. మంగళవారంతో ఈ కార్యక్రమం 9వ రోజుకు చేరింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా కూటమి శ్రేణులు మొత్తం 23.63 లక్షల కుటుంబాలను నేరుగా కలిసి, ప్రభుత్వ విజయాలను వివరించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కేవలం మంగళవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.03 లక్షలకు పైగా గృహాలను సందర్శించి, రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ముఖ్యంగా, ఎన్నికల హామీలైన 'సూపర్ సిక్స్' పథకాల అమలు తీరును ప్రతి ఇంటికీ




తెలియజేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, వారి అభిప్రాయాలను కూడా స్వీకరి స్తున్నారు. ఈ కార్యక్రమ పురోగతిని టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్నారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

- మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు



- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

2

## 'అమరజీవి జలధార'

### గోదావరి జిల్లాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం - పవన్ కల్యాణ్

- జల్ జీవన్ మిషన్ కింద అమలవుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు
- తీరప్రాంతాల్లోని 33 లక్షల మందికి సురక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యం
- నిర్దేశిత వ్యవధిలోనే నిర్మాణాలను పూర్తి చేయాలన్న పవన్



**నేటి శుభోదయ, సూర్యాపేట :** జల్ జీవన్ మిషన్ కింద చేపడుతున్న 'అమరజీవి జలధార' ప్రాజెక్టు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగి రిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిపై ఉన్నతాధికా రులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తీరప్రాంతాల్లోని దాదాపు 33 లక్షల మంది ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు పవన్ వివరించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత విషయంలో రాజీ పడ కూడదని అధికారులకు స్పష్టం చేశారు. నిర్దేశిత వ్యవధిలోనే కీలక నిర్మాణాలను పూర్తి చేసి, ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తీరప్రాంత ప్రజల తాగునీటి భద్రతను నిర్ధారించడంలో జల్ జీవన్ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొనియాడారు.

## మెగా డీఎస్సీ-2025

### - పిటిషన్ పై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు

- మెగా డీఎస్సీ-2025పై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో పిల్
- క్రీడా కోటా నిబంధనలు మార్చి కొందరికి లబ్ధి చేకూర్చారని ఆరోపణ
- అనర్హమైన స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో నియామకాలు జరిగాయన్న పిటిషనర్

2



## తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్...

- బ్రహ్మోత్సవాల్లో ఈ సేవలు రద్దు



- సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- బ్రహ్మోత్సవాల వేళ అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసిన టీటీడీ
- వృద్ధులు, దివ్యాంగులతో పాటు పలు ప్రత్యేక దర్శనాలు కూడా నిలిపివేత
- భక్తులు మార్పులను గమనించి సహకరించాలని టీటీడీ విజ్ఞప్తి

2

## ఆలూరు ఎమ్మెల్యేపై కేసు రాజకీయ కక్షసాధింపే

### - అంబటి రాంబాబు

- వైసీపీ నేతలపై కఠిన సెక్షన్లతో కేసులు పెడుతు-న్నారన్న అంబటి
- కేసులు, అరెస్టులను ఆయుధంగా వాడుకుంటు-న్నారని మండిపాటు
- ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్య



2

నేటి శుభోదయ
బుధవారం | హైదరాబాద్
05 - 08 - 2026
www.netisubhodaya.com


# అగాధం నుంచి అభివృద్ధి వైపు..

**మొదటిపేజీ తరువాయి..** మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్ లెక్కలు, ఆర్థిక గణాంకాలు బ్రహ్మ పదార్థం కాదని, ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా ఉండాలనే ఉద్దేశంతో ఈ నివేదికను ప్రజల ముందు ఉంచుతున్నామని అన్నారు. "ఇంట్లో ఆదాయానికి తగ్గట్టు ఖర్చులు ఎలా చేస్తామో, రాష్ట్రానికి వచ్చిన ఆదాయాన్ని కూడా అంతే జాగ్రత్తగా అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు పెడుతున్నాం" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర విభజన నాటి కష్టాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కించామో, 2019 తర్వాత పాలనలో జరిగిన విధ్వంసం, తిరిగి అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంస్కరణలను సోదాహరణంగా వివరించారు.

**గత ప్రభుత్వ తప్పిదాలు.. ఆర్థిక నష్టం**

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు దారుణంగా మందగించిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో సగటున 13.5% జీఎస్డీపీ వృద్ధిరేటు సాధిస్తే, 2019-24 మధ్య అది 10.30 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఈ వృద్ధిరేటును కొనసాగించకపోవడం వల్ల రాష్ట్రం రూ.6.94 లక్షల కోట్ల మేర జీఎస్డీపీని నష్టపోయిందని లెక్కలతో సహా వివరించారు. ఇదే సమయంలో తెలంగాణతో తలసరి ఆదాయంలో వ్యత్యాసం భారీగా పెరిగిపోయిందని, 2018-19లో రూ.55,817గా ఉన్న ఈ గ్యాప్, 2023-24 నాటికి రూ.1,06,854కు పెరిగిందని పేర్కొన్నారు. సరైన ప్రణాళికతో ముందుకెళ్లి ఉంటే, 2025-26 నాటికి ఏపీ తలసరి ఆదాయం రూ.3,67,115గా ఉండేదని, కానీ గత ప్రభుత్వ విధానాల వల్ల అది రూ.2,94,507కే పరిమితమైందని, తద్వారా ప్రతి వ్యక్తి రూ.72,608 మేర ఆదాయాన్ని కోల్పోయారని విశ్లేషించారు.

## రెండున్నరేళ్లలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు

### - లోక్‌సభలో కేంద్రం వెల్లడి

**మొదటిపేజీ తరువాయి..** సాధించిన రూ. 11,386 కోట్లతో పోలిస్తే ఇది అధికమని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంటులో ఈ వివరాలను అధికారికంగా సమర్పించింది. ఆర్థిక క్రమశిక్షణను పాటించడం, ప్రాజెక్టుల ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేసి సమర్థవంతంగా అమలు చేయడం వల్లే స్వల్ప కాలంలోనే ఎక్కువ నిధులను సాధించగలిగామని తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 2020-21 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ. 31,005.47 కోట్లు అందాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రూ. 19,619 కోట్లు విడుదలయ్యాయి. 2024-25లో రూ. 7,901.56 కోట్లు, 2025-26లో రూ. 8,289.61 కోట్లు, 2026-27లో ఆగస్టు 1 నాటికి రూ. 3,428.14 కోట్లు మంజూరయ్యాయి. మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు 50 ఏళ్ల కాలపరిమితితో వడ్డీ లేని రుణాలను అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో 2020-21లో రూ. 688 కోట్లు, 2022-23లో రూ. 6,105 కోట్లు, 2023-24లో రూ. 4,090.81 కోట్లు ఈ పథకం కింద అందాయి. మరోవైపు, రాష్ట్ర విభజన జరిగిన 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు రూ. 16,078.76 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ నిర్ధారించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అదే ఎంపీకి ఇచ్చిన మరో సమాధానంలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనానుభవం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. తద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించి సమ్మిళిత వృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గం టీడీపీ నేత

**మొదటిపేజీ తరువాయి..** బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రేపల్లెకు చెందిన టీడీపీ నేత గూడపాటి శ్రీనివాసరావు వైసీపీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గూడపాటికి వైసీపీ కండువా కప్పి జగన్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... గూడపాటి శ్రీనివాసరావును వైసీపీ కుటుంబంలోకి హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని పిలుపునిచ్చారు. గూడపాటి శ్రీనివాసరావు చేరికతో రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ మరింత బలపడిందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రానున్న రోజుల్లో క్షేత్రస్థాయి బలాబలాల దృష్ట్యా రేపల్లె నియోజకవర్గ రాజకీయం మరింత ఆసక్తికరంగా మారనుంది.

## మెగా డీఎస్సీ-2025 : పిటిషన్ పై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు

**మొదటిపేజీ తరువాయి..** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ నియామకాల కోసం చేపట్టిన మెగా డీఎస్సీ-2025 ప్రక్రియలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ నియామక ప్రక్రియలో జరిగిన అవకతవకలు కేవలం కొన్ని పొరపాట్లు కావని, ఇది వ్యవస్థీకృత వైఫల్యమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది, రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు ప్రభుత్వం క్రీడా కోటా విధానంలో కీలక మార్పులు చేసిందని శ్రీరామ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. క్రీడా కోటా రిజర్వేషన్లను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచారని, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలన్న నిబంధనను కూడా తొలగించారని తెలిపారు. ఈ మార్పుల ద్వారా ముందుగా నిర్ణయించుకున్న కొందరు అభ్యర్థులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా పారదర్శకత లేకుండా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అర్హత లేని స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ఆధారంగా పలువురు అభ్యర్థులు నియామకాలు పొందారని, దీనికి సంబంధించిన కొన్ని నమూనా సర్టిఫికెట్లను ఆయన కోర్టు ముందు ఉంచారు. గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు బదులుగా, కేవలం స్థానిక పోటీల్లో పాల్గొన్న సర్టిఫికెట్లను ఉపయోగించారని వాదించారు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ప్రభుత్వం క్రీడా కోటాకు సంబంధించిన జీవోలను వెనక్కి తీసుకుందని, ఈ చర్యే విధానపరమైన మార్పులపై తీవ్ర అనుమానాలకు తావిస్తోందని, కాబట్టి స్వతంత్ర దర్యాప్తు అవసరమని ఆయన పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా తాము చాలా సమాచారాన్ని సేకరించామని, ప్రభుత్వం పూర్తి మెరిట్ జాబితాను ప్రచురించనందున కొన్ని ఉదాహరణలను మాత్రమే కోర్టు ముందు ఉంచగలిగామని వివరించారు. ప్రభుత్వ చర్యలకు, బెదిరింపులకు భయపడి చాలా మంది బాధితులు కోర్టును ఆశ్రయించడం లేదని కూడా ఆయన తెలిపారు. ఈ అంశం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల భవిష్యత్తుకు సంబంధించినది కాబట్టి, వ్యవస్థీకృత లోపాలను సరిదిద్దడానికి ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారానే దర్యాప్తు కోరుతున్నామని స్పష్టం చేశారు. వాదనలు విన్న హైకోర్టు, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## ఆలూరు ఎమ్మెల్యేపై కేసు రాజకీయ కక్షసాధింపే

### - అంబటి రాంబాబు

**మొదటిపేజీ తరువాయి..** టీడీపీ శ్రేణులపై దాడి చేశారనే కేసులో ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి కోర్టు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. చంద్రబాబు ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసు మోపిందని మండిపడ్డారు. గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. టీడీపీ నేతలు తప్పులు చేస్తుంటే, వైసీపీ నాయకులపై అక్రమంగా కఠిన సెక్షన్లతో కేసులు పెడుతూ బెయిల్ కూడా రాకుండా చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆలూరు ఘటనలో అసలు తప్పు చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అక్కడ టీడీపీ నేతే మహిళపై దాడి చేసి ఆమె బట్టలు చింపినా, అధికార పార్టీ నాయకులను కాపాడేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అంబటి పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను భయపెట్టేందుకు కేసులు, అరెస్టులను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని, అయితే ఎలాంటి బెదిరింపులకు వైసీపీ భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

## అయోధ్య నిధుల కేసులో సాధువుల ప్రమేయం లేదు

### - సీఎం యోగి ఆదిత్యనాథ్

**మొదటిపేజీ తరువాయి..** అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణల కేసులో సాధువులు, సంతుల ప్రమేయం ఏమీ లేదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమర్పించిన ప్రాథమిక నివేదికలో ఈ విషయం వెల్లడైందని ఆయన మంగళవారం పేర్కొన్నారు. ఈ అంశంపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాద్ధాంతం చేస్తున్నాయని యోగి ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో నిర్ణీత ఎజెండాపై చర్చ జరపకుండా, సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని విపక్షాలు ప్రకటించడంతో ఈ వివాదం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసు విచారణ నిమిత్తం ఐజీ కిరణ్ నేతృత్వంలో నూతన సిట్‌ను ఏర్పాటు చేసినట్లు జూలై 27న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు బృందం ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## నైతిక విలువలతోనే సంపూర్ణ విద్యా వికాసం

### - మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు

**మొదటిపేజీ తరువాయి..** ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

## తిరుమల శ్రీవారి భక్తులకు అలర్ట్..

### - బ్రహ్మోత్సవాల్లో ఈ సేవలు రద్దు

**మొదటిపేజీ తరువాయి..** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు తిరుమలలో అన్ని రకాల ఆర్జిత సేవలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న ఈ ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తులకు పెద్దపీట వేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. టీటీడీ ప్రకటన ప్రకారం, బ్రహ్మోత్సవాల సమయంలో అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ వంటి ఆర్జిత సేవలను పూర్తిగా నిలిపివేయనున్నారు. వీటితో పాటు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐలు, దాతలకు కల్పించే ప్రత్యేక ప్రవేశ దర్శనాలను కూడా రద్దు చేశారు. ఈ మార్పులను భక్తులందరూ గమనించి, టీటీడీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి అత్యధిక దర్శన సమయం కేటాయించేందుకు టీటీడీ ఈ చర్యలు చేపట్టింది. ఈ తొమ్మిది రోజుల పాటు స్వామివారి వాహన సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం అధికారిక ప్రకటన జారీ చేసింది.

## కూటమి ప్రభుత్వం అందించే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

### -రాష్ట్ర గౌడ  కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామా ప్రసాద్ గౌడ్



**పెనమలూరు, ఆగష్టు 4, నేటి శుభోదయ :**
కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ పాంప్లెట్ ల రూపంలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేయడం జరిగిందని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాలమేరకు యానమలకుదురు లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని కూటమినాయకులతో కలిసి పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ స్థానికంగా రోడ్ల పరిస్థితి, డ్రైనేజీల పరిస్థితి, విద్యుత్ సరఫరా పరిస్థితిపై వివరాలు సేకరిస్తూ, చిన్న చిన్న సమస్యలు ఉన్న అక్కడికక్కడే స్థానిక శాసనసభ్యులు బోడే ప్రసాద్ తో మాట్లాడి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రతినెలా ఒకటవ తారీకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు.గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో పడిన ఇబ్బందులను గుర్తు చేస్తూ, ప్రశ్నించిన వారిపై దాడులు అక్రమ కేసులు పెడుతూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పాలన సాగించాడని,అటువంటి రాక్షసుడు చేతికి అధికారం రాకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న,రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్న మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉంటేనే అది సాధ్యం అన్నారు.వైసీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, ఒక్కసారి నమ్మి మోసపోయి ఓట్లు వేసిన అందుకే రాష్ట్రం 20 సంవత్సరాలు వెనుకపడిందని,చదువుకున్న పిల్లలు ఒక్క ఉద్యోగం కూడా లేకుండా వలసలు వెళ్లిపోయారని, ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. స్థానిక ప్రజలందరూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన కి సంతృప్తిగా ఉన్నారని, కూటమి నాయకులు ఎక్కడికి వెళ్లినా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో  తాడిశెట్టి వీరస్వామి, కొక్కిలిగడ్డ సంగీతరావు, కందుల శివరావు, సంపర శేఖర్, ఎడ్లపల్లి సురేష్, బలగం కొండ, చిరాఉరి శేషు, బాణావతి విజయ్ కూటమి నాయకులు పాల్గొన్నారు

## ఎల్నినో నేపథ్యంలో త్రాగు నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నిరంతర పర్యవేక్షణ ఉండాలి

- **ప్రజా ఫిర్యాదులపై దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించండి**
- **పుట్లూరు మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సుడిగాలి పర్యటన**



**అనంత పురం, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజల ఫిర్యాదులపై దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించాలని, త్రాగు నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు.★-మంగళవారం పుట్లూరు మండలంలో జిల్లా కలెక్టర్ పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆయా శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పించుకోకుండా పరిష్కార మార్గాలను చూడాలన్నారు. పుట్లూరు మండలం నుంచి జిల్లా కేంద్రంలో జరిగే పీజిఆర్ఎస్ కు వందల సంఖ్యలో సమస్యలు వస్తున్నాయని, మండల కేంద్రంలో సక్రమంగా పరిష్కారం చేస్తే అక్కడ వరకు రావాల్సిన అవసరం లేదని, పిజిఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండరాదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎల్నినో నేపథ్యంలో ఏ ఒక రైతు కూడా నష్టపోకూడదని, వారికి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలలో ఎక్కడ కూడా త్రాగునీటి సమస్య లేకుండా బోర్లను నిరంతరం పర్యవేక్షించాలని, సోర్స్ నీటిమట్టం గమనిస్తుండాలని, ముందే ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ ఏపీ సిఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయం అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని, యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని  ఆదేశించారు-ఈ సమావేశంలో తహసీల్దార్ బాలమ్మ, ఎంపిడిఓ అలివేలమ్మ,  ఎంఈవో శ్రీదేవి, వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయని, వెటర్నరీ డాక్టర్ సువర్ణ, డిప్యూటీ ఎంపిడిఓ లు బాబా ఫక్రుద్దీన్, శివ ప్రసాద్, ఏపీ ఎం ఖలీం, ఏపీఓ తులసి ప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన రామసేన అధ్యక్షుడు 'కంబాల' బంగారు వరలక్ష్మి కానుక సీజన్ -4....!!

- **బంగారు రూపులు కోసం అధికంగా తరలివచ్చిన మహిళలు..!**
- **లక్కీ డ్రాలో గెలిపొందిన 300 మంది మహిళలకు ఉచితంగా వరలక్ష్మి రూపులు పంపిణీ..! అందరికీ పట్టుచీరలు..!!**





**కోరుకొండ, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
గోకవరం నుంచి రాజమండ్రి వెళ్లే రహదారిలో ఉన్న విజయ గార్డెన్ ఫంక్షన్ హల్ లో బంగారు వరలక్ష్మి కానుక సీజన్-4 లక్కీ డ్రా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులు జ్యోతి ప్రజ్వాలన చేసి లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలిత వారికి అర్చకులు పూర్ణ కలశంతో ఘన స్వాగతం పలికి, వేదమంత్రాలతో ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ ధ్యేయంగా, మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో, శ్రావణ మాసంలో మహిళలు ఎంతో సంతోషంగా వరలక్ష్మి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో 2023 సంవత్సరంలో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన రావడంతో గత మూడు సంవత్సరం నుంచి విజయవంతంగా నిర్వహించి, ఈ ఏడాది కూడా బంగారు వరలక్ష్మి కానుక సీజన్ -4 ప్రారంభించమన్నారు. ఈ బంగారు వరలక్ష్మి కార్యక్రమానికి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి మహిళకి బంగారు రూపు వచ్చే వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తునే ఉంటానని వెల్లడించారు. ఇటువంటి కార్యక్రమాన్ని ఇప్పటికి వరకు ఎవరు కూడా నిర్వహించలేదన్నారు. రానున్న కాలంలో మహిళాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మన దేశం విశ్వగురువు అని, మన సంస్కృతి సాంప్రదాయాలను, ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. అనంతరం లక్కీ డ్రాలో గెలిపొందిన 300 మంది మహిళలకు కంబాల శ్రీనివాసరావు దంపతులు బంగారు వరలక్ష్మి రూపులను ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే లక్కీ డ్రాలో రూపులు రాని వారికి పట్టు చీరలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు....

## 13వ డివిజన్‌లో కోటి 15 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్యే గద్దె



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :**
పేదల కష్ట సుఖాల్లో అండగా ఉంటామని ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యానికి అయిన ఖర్చులో అధిక భాగాన్ని వారికి చెల్లిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు అండగా నిలుస్తున్నారని తూర్పు  ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.మంగళవారం ఉదయం తూర్పు లోని 13వ డివిజన్ న్యూ ఆర్టీసీ కాలనీ, రామాలయం దగ్గర వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన కోటి 15 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె  హాజరై లబ్ధిదారులకు  చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముమ్మనేని ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గద్దె  మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలిసి పేదల వైద్య సేవలకు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని అమలు చేస్తున్నారని, అందుకు ప్రత్యేకంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క తూర్పు లోనే ఇప్పటి వరకు సుమారు రూ.18 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చెసిన తప్పిదాల్లో సీఎంఆర్ఎఫ్ పథకాన్ని అమలు చేయకపోవడం కూడా ఒకటని తెలిపారు. జగన్ హయాంలో ఈ పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల చాలా మంది తమ సొంత నిధులు వెచ్చించి వైద్యం చేయించుకున్నారని, వారు ఇప్పటికీ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సీఎంఆర్ఎఫ్‌ను అమలు చేయకపోవడాన్ని తలచుకొని ప్రజలు ఆయన్ను శాపాలు పెడుతున్నారని అన్నారు. పేదలు ఇబ్బందులు పడుతున్నారనే కనీస అవగాహన కూడా జగన్‌కు లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన మొదటి రోజు నుంచి ఈ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని అమలు చేస్తూ పేదల వైద్యానికి అయన ఖర్చులో అత్యధిక భాగాన్ని వారికి అందిస్తూ వారు అప్పులపాలు కాకుండా ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటామని ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలకు నిధులు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి మూల్పూరి కళ్యాణి, నూతి శ్రీను, గద్దె ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, శొంఠి సాయి లక్ష్మి, గొరిపర్తి నామేశ్వరరరావు, నందిపాటి దేవానంద్, దయాల శిరీషా గాంధీ, సుగసాని రత్నశ్రీ కృష్ణ ప్రసాద్, కొర్రపాటి శ్రీను, దాసరి గాబ్రియేల్, రాయి రంగమ్మ, గల్లా శ్రీను, రామారావు, గద్దె రమేష్, పడాల గంగాధర్, ముమ్మనేని రాజా, కంఠంనేని మానస గల్లా రవి. తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రం 'యర్రంశెట్టి' వారి పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి..!





**కోరుకొండ, ఆగస్టు 04, నేటి శుభోదయ**
రాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామంలో సీనియర్ నాయకుడు యర్రంశెట్టి శ్రీను కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సతీమణి, జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న చి. నవీన్ చంద్ర ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జరిగిన పుట్టినరోజు సంబరాల్లో శ్రీమతి వెంకటలక్ష్మి పాలుపంచుకున్నారు. బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, జనశైనికులు, గ్రామస్తులతో ఉత్సాహంగా గడిపారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది తల్లి పాల ప్రాముఖ్యత పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలి

- డి.ఎల్.ఏ.టీ.ఓ .(అడిషనల్ డి యం ఎచ్ ఓ.) డాక్టర్ జయలక్ష్మి



**అనంత పురం, ఆగస్టు 04, నేటి శుభోదయ :** వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో డా. జయలక్ష్మి పాల్గొన్నారు, ఈ సందర్భంగా డా. జయలక్ష్మి మాట్లాడుతూ ప్రధానంగా ఈ రోజు థీమ్ యుక్త వయస్సు లో రక్త హీనత నివారణ అన్న అంశం మీద వైద్య సిబ్బంది తీసుకోవలసిన చర్యలు పట్ల అవగాహన కల్పించడం జరిగింది.అలాగే ఈ రోజు అజండా అంశం “”ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు “”సందర్భంగా తల్లి పాల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు అలాగే కుష్టు వ్యాధి ,టీబీ నివారణ,మరియు ఎచ్ ఐ వి ఎయిడ్స్ నివారణ అంశాలు పై సవివరంగా అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం కొనకొండ్ల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వివిధ వ్యాధుల నివారణ విధానాలు గురించి అవగాహన కల్పించారు మరియు కుష్టు వ్యాధి పట్ల మంచి అవగాహన కలిగి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాకంగా సర్టిఫికెట్స్ ను అందించారు.ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆఫీసర్ నాగన్న, ఆరోగ్య విద్యా అధికారి గంగాధర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గురుప్రసాద్, లక్ష్మీదేవి,యం పి ఎచ్ ఈ ఓ కుమార్ స్వామి, సుశీలమ్మ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొనకొండ్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితున్ని పరామర్శించిన సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి



**అనంత పురం, ఆగస్టు 04, నేటి శుభోదయ :** రాప్తాడు నియోజక వర్గం రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామానికి చెందిన గవ్వల నరేష్ పాము కాటుకు గురయ్యారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గవ్వల నరేష్ ని పరామర్శించారు. ఆయన ఆర్యోగం పరిస్థితిపై ఆరా తీశారు చికిత్స అందిస్తున్న వైద్యులు తో మాట్లాడి యోగా క్షేమాలు అడిగి తెలుసుకొని. ధైర్యంగా ఉండాలని తోపుదుర్తి రాజ శేఖర్ రెడ్డి భరోసా కల్పించారు.

## అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**అనంత పురం ఆగస్టు 04 , నేటి శుభోదయ :** అనంతపురము జిల్లా, పుట్లూరు, ఆగస్ట్ 4: మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ పుట్లూరు మండలం కంది కాపుల, పుట్లూరు గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లల పౌష్టికాహారం పై అక్కడే ఉన్న తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. బాలింతలతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సరుకులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. వాటికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పంపిణి చేయాలని అధికారులను ఆదేశించారు. పిల్లల బరువు స్వయంగా చూసి యాప్ నందు నమోదు ప్రక్రియ పరిశీలించారు. అలాగే పిల్లలతో కాసేపు ముచ్చటిస్తూ పిల్లలకు ఆట పాటలతో బడి బాగా ఉందా అని, టీచర్ బాగా చూసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్వాడి టీచర్ తో మాట్లాడుతూ బరువు తక్కువ పిల్లలపై, ఎత్తు తక్కువ గల పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి పౌష్టికాహారం అందించడం, పిల్లలు, గర్భిణి స్త్రీలలో రక్తహీనత లేకుండా ఉండేలా ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా చర్యలు తీసుకుని యాప్ నందు వివరాలు నమోదు చేయాలని, యాప్ లో నమోదు చేసిన వివరాలు వాస్తవికంగా ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాలమ్మ, ఎంపిడిఓ అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ రైతు బజార్‌లో తక్కువ ధరల బియ్యం కౌంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే -వెనిగండ్ల రాము

- ప్రజలకు బియ్యం అందిస్తూ తక్కువ ధరకు స్టీమ్,రా బియ్యం విక్రయాలు మొదలుపెట్టిన.ఎమ్మెల్యే
- గుడివాడ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం.
- వర్షం వస్తే నీళ్లలో కూరగాయలు అమ్మే రైతు బజార్... అభివృద్ధిని కల్లారా చూస్తున్నాం
- అందరం కలిసి మన ఊరును స్పెషల్ గుడివాడగా... ఎన్టీఆర్ గుడివాడగా మార్చుకుందాం
- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ...రైతు సంక్షేమానికి పెద్దపీట
- బహిరంగ మార్కెట్ క్వాలిటీనే తక్కువ ధరకు ఇస్తున్నాం:రైస్ మిల్లర్స్



**గుడివాడ,ఆగస్టు 4, నేటి శుభోదయ :** ప్రజలకు మంచి జరుగుతుందంటే కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందిస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పేద వర్గాలకు మేలు చేసేందుకు ఏర్పాటుచేసిన తక్కువ ధరకు బియ్యం విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.గుడివాడ రైతు బజార్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తగ్గింపు ధరల బియ్యం విక్రయ ప్రత్యేక కౌంటర్లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కొనుగోలుదారులకు బియ్యం అందించి విక్రయాలను ఎమ్మెల్యే రాము లాంఛనంగా ప్రారంభి, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాము మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు మంచి చేసే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ప్రజలకు మేలు జరుగుతుందనుకుంటే ప్రభుత్వం, మేము అందరం సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ధరలు పెరుగుతున్నాయన్న ఉద్దేశంతో తక్కువ ధరకు ప్రజలకు బియ్యం అందించాలనే లక్ష్యంతో మంత్రి నాదెండ్ల మనోహర్ 23వ తేదీన ఈ ప్రక్రియను ప్రారంభించారనీ అన్నారు. కేవలం 8 రోజుల వ్యవధిలో సంబంధిత చర్యలను పూర్తి చేయడమే కాకుండా యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారనీ తెలిపారు. ఇదే కూటమి ప్రభుత్వ గొప్పతనమని ,పని చేసే ప్రభుత్వమంటే కూటమి ప్రభుత్వమేనని ఆయన ఉద్ఘాటించారు. ప్రజలకు మంచి జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్టీమ్, రా బియ్యాన్ని తక్కువ ధరకే అందిస్తున్నామని,ఈ కార్యక్రమాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలనీ పిలుపునిచ్చారు.రైతులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందనీ, ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. గతంలో జనవరిలో వచ్చిన సంచులు రాని పరిస్థితి ఉండేదనీ,ధాన్యం అమ్మిన నెలల తర్వాత కూడా డబ్బు జమ కాక రైతులు అనేక ఇబ్బందులు పడేవారనీ గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారనీ, వారి సహకారంతో గుడివాడలో అనేక మార్పులు వచ్చాయన్నారు. మనం ఉన్న గుడివాడ రైతు బజార్ గతంలో వర్షం వస్తే నీళ్లలో కూరగాయలు అమ్మేవారు. ఇప్పుడు ఎంత మార్పు వచ్చిందో కళ్లారా చూడవచ్చనీ తెలిపారు.ప్రజలందరితో కలిసి పనిచేస్తే ఎంత సాధించవచ్చో సీఎం చంద్రబాబు చూపించారన్నారు.గొప్ప గొప్ప కార్యక్రమాలు చేసుకుంటూ మన ఊరు స్పెషల్ గుడివాడగా అభివృద్ధి చేసుకుంటూ అన్న ఎన్టీఆర్ గుడివాడగా మార్చుకుందామని ఎమ్మెల్యే రాము ఆకాంక్షించారు.కూటమి నాయకులు మాట్లాడుతూరాష్ట్రంలోని 115 రైతు బజార్లలో, 500 వరకు రైస్ మిల్లుల లేఅవుట్‌లలో మనిషికి 10 కిలోల చొప్పున బియ్యం విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మంచి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు బజార్లతో పాటు,30 రైస్ మిల్ పాయింట్ల ద్వారా విక్రయాలు ప్రారంభించామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఏ క్వాలిటీ ఉంటుందో అదే క్వాలిటీని తక్కువ ధరకు 10 కిలోల వరకు ఇస్తున్నాం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,గుడివాడ తాసిల్దార్ ప్రసాద్,పిడిఎఫ్ డి.టీ విజయలక్ష్మి, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంప్రాజు సాంబయ్య, రైతు బజార్ ఈవో ఓగిరాల శ్రీకాంత్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, గోకవరపు సునీల్, రామిదేని వేణు, షేక్ జానీ, దేవరపల్లి కోటి, దారపురెడ్డి మనీశ్వరరావు, రఫీ, వంగపండు ఆదినారాయణ, గొర్ల శ్రీలక్ష్మి, సిరిపురపూ తులసిరాని, యార్లగడ్డ సుధారాణి, కంచర్ల సుధాకర్, అందుగుల ఏసు పాదం , ఇమ్మానుయేలు, వసంతవాడ దురారావు, అడుసుమిల్లి శ్రీనివాస్, కోడూరు ప్రభు, సయ్యద్ మున్వర్, షేక్ సర్కార్, అల్లాడ శ్రీనివాస్,జనసేన నాయకులు గుండు వెంకట్రావు, ఇంటరూ గజేంద్ర, కొదమల గంగాధర్ ,షేక్ నాగూర్ భాష,రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీరయ్య చౌదరి, గుడివాడ అధ్యక్షులు టీవీఎస్ ప్రసాద్, జి నరసింహారావు, జి రామకృష్ణ, ఎస్ జగ్గారావు, బి కృష్ణమోహన్రావు , సిహెచ్ కృష్ణ ప్రసాద్, పలువురు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## భారత ఉపరాష్ట్రపతిని కలిసిన తెలుగుదేశం పార్లమెంటరీ ప్రతినిధి బృందం

### : బాపట్ల ఎంపీ, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ భాగస్వామ్యం



**బాపట్ల , ఆగస్టు 4, నేటి శుభోదయ :** తెలుగుదేశం పార్టీ లోక్‌సభ సభ్యుల ప్రతినిధి బృందం మంగళవారం భారత ఉపరాష్ట్రపతిని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ప్రత్యేక భేటీలో బాపట్ల లోక్‌సభ సభ్యులు, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంటు సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సంబంధించిన విజన్, అభివృద్ధి, పురోగతి మరియు విశిష్టతను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి బహూకరించారు.సమావేశంలో ఉపరాష్ట్రపతి టిడిపి ఎంపీల బృందంతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. అమరావతి రాజధాని నిర్మాణం, ప్రణాళికలు మరియు అభివృద్ధి ప్రాధాన్యతను ప్రతిబింబించేలా పుస్తకాన్ని అందించినందుకు, టిడిపి ఎంపీలు తీసుకున్న ఈ చొరవను ఉపరాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు.

## బాపట్ల త్రవ్వ కాలువ వద్ద వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మి దేవి సారె మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.



**బాపట్ల , ఆగస్టు 04, నేటి శుభోదయ :** మంగళవారం స్థానిక బాపట్ల త్రవ్వ కాలువ మహాలక్ష్మి అమ్మవారి చెట్టు దగ్గర మహాలక్ష్మి దేవి అమ్మవారికి సారె మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది కార్యక్రమంలో మహిళలు అత్యధికంగా పాల్గొని అమ్మవారికి సారే సమర్పించారు కార్యక్రమంలో 100 మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం నైవేద్యాలు నిరాజనం మంత్రపుష్పం తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు అని అర్చక స్వామి కేశవాచార్యులు తెలియజేశారు.

# నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం అన్యాయం

- పరీక్ష రాయని వారికి సర్టిఫికెట్ లేని వారికి ఉద్యోగాలు
- లోకేష్ నాయకత్వంలో డీఎస్సీ అక్రమాలకు అడ్డు అదుపు లేదు
- హర్యానాలో టీచర్ పోస్టులు అమ్మిన ముఖ్యమంత్రి అరెస్టు జైలు శిక్ష
- ఎంత నిచ్చనికైనా దిగజారేందుకు టిడిపి సిద్ధం





**కైకలూరు, ఆగష్టు 4, నేటి శుభోదయ :**
స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో జగన్ చేసిన మంచిని ప్రతి ఇంటికి తీసుకువెళదాం ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్ర నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆయన మండిపడ్డారు. డీఎస్సీలో 3% స్పోర్ట్స్ కోటాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని అర్హత సర్టిఫికెట్లు లేకపోయినా చివరికి పరీక్ష రాయని వారికి కూడా ఉద్యోగాలు ఇచ్చారని కొడాలి నాని అన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో జరిగిన ఈ డీఎస్సీలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆటలు రాకపోయినా ఉద్యోగాలు ఇచ్చేశారని ఉద్యోగం వచ్చిన తరువాత బి. ఈడీ పూర్తి చేసేలా వెసులుబాటు కల్పించేలా పరిస్థితులు ఉన్నాయని ఎద్దేవా చేశారు. హర్యానాలో టీచర్ పోస్టులు అమ్మిన కేసులో సీఎం అరెస్టై జైలు శిక్ష అనుభవించారని, అక్కడి కంటే ఏపీలో అక్రమాలు పెద్ద స్థాయిలో జరిగి దొరికిపోయారని ఆరోపించారు. అబద్ధాలు, మోసాలతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని, జరిగిన అక్రమాలను బయటపెడితే మీడియా ద్వారా జగన్‌ను విమర్శింపజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో డీఎస్సీ అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేపడతామని తెలిపారు.నీట్ పేపర్ లీకేజ్ ఘటనలో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే, వారికి న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన ఉద్యమాలను ఆయన గుర్తుచేశారు.అప్పట్లో కొందరు ఆందోళనలను వేరే విధంగా చిత్రించే ప్రయత్నం చేసినప్పటికీ, చివరికి ప్రభుత్వాలు తలవంచక తప్పలేదని తెలిపారు.బీహార్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడి సీటులోనూ పార్టీ ఓడిపోయిన వైనాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రంలోనూ ప్రజల తీర్పు అదే విధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ క్రెడిట్ మరియు సీఎం చంద్రబాబు నాయుడు పాత్రపై మాజీ మంత్రి కొడాలి నాని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.చంద్రబాబు కేవలం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే హడావుడిగా కొబ్బరికాయ కొట్టి, పేపర్ ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాదాపు రూ. 1,000 కోట్లు ప్రజాధనం వెచ్చించి భూ సేకరణ పూర్తి చేశామని తెలిపారు. 3 గ్రామాల ప్రజలను గౌరవంగా తరలించి, జీఎంఆర్ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించి, అన్ని అనుమతులతో పనులు ప్రారంభించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఎర్ర బస్సు కూడా సరిగ్గా రాణి మా ఊరికి ఎయిర్‌పోర్ట్ ఎందుకు, మా భూములు లాక్కుని ఇబ్బంది పెడుతున్నారు" అంటూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒక మహిళ జగన్ వద్ద వాపోయారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎవరికీ ఎలాంటి నష్టం జరగకుండా తక్కువ విస్తీర్ణంలోనే ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామని జగన్ హామీ ఇచ్చి అమలు చేశారని గుర్తుచేశారు.ఎలాంటి నిధులు కేటాయించని చంద్రబాబు, ఇప్పుడు కోట్లు ఖర్చు పెట్టి పిల్లలతో డ్యాన్సులు చేయించి, జనాలను సమీకరించి గొప్పలు చెప్పుకుంటున్నారని కొడాలి నాని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు.చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా "సూపర్ సున్నా" చేశారని, ఈ హామీలతో ప్రజలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు.అధికారంలోకి వస్తే రుణమాఫీ చేస్తామని టిడ్కో లబ్ధిదారులకు హామీ ఇచ్చి మోసగించారని దుయ్యబట్టారు. "చంద్రబాబు ఇవ్వకపోతే నా జేబులోంచి ఇస్తాను" అంటూ సొల్లు కబుర్లు చెప్పారని, రెండేళ్లు గడుస్తున్నా ఆ హామీ ఎందుకు నెరవేర్చలేదని ఎన్నికల సమయంలో నోటికి వచ్చినట్లు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదన్నారు. ప్రజలందరూ ప్రభుత్వ తీరును గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.సాగునీరు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, ఈ సమస్యపై నిలదీస్తే "పైనుంచి చెప్పాలి" అంటూ అధికారులు కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. ఓటీపీల పేరుతోనూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు.ఎమ్మెల్యే విరూపాక్షిపై పెట్టిన కేసు పూర్తిగా అక్రమమని, ప్రత్యర్థులే కావాలని దుర్మార్గపు చర్యలకు పాల్పడి తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై ఇలాగే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కులాల మధ్య చిచ్చుపెట్టేది టీడీపీనేనని, ఆ నెపాన్ని వైసీపీపై మోపేందుకు యత్నిస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసం ఎంత నీచానికైనా దిగజారేందుకు ఆ పార్టీ సిద్ధపడిందని విమర్శించారు.పోలీసుల తీరుపై అప్రమత్తంగా ఉండాలని,వారి ట్రాప్‌లో పడొద్దని శ్రేణులకు సూచించారు. అక్రమ కేసులతో వైయస్ జగన్‌ను ఎవరూ ఏమీ చేయలేరని, 2029లో జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. ఇప్పుడు చేసే ప్రతి అక్రమానికి పదింతలు అనుభవించక తప్పదని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులందరూ ధైర్యంగా ముందుకు రావాలనీ, ప్రతి వార్డులోనూ వైసీపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికల్లో ఎవరూ వెనకడుగు వేయాల్సిన అవసరం లేదని, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినా 4 నెలలు వెళ్లి వద్దామంటూ కార్యకర్తల్లో ధైర్యం నింపారు. రాష్ట్రంలో ఏ ఒక్క స్థానంలో కూడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, ప్రతి చోట మన అభ్యర్థులు బరిలో నిలుస్తారని తెలిపారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నరేంద్ర మోడీ సర్కార్ల వైఫల్యాలు, మోసాలను ప్రజలకు వివరిస్తామని, అదేవిధంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిని ఇంటింటికి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని కొడాలి నాని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్రెల శీను,మెరుగుమాల కాళీ,మట్ట జాన్ విక్టర్, అడబాల అప్పారావు,కందుల నాగరాజు,పేయ్యల ఆదాము,చిన్ని సత్య దుర్గాప్రసాద్, అడప పండు,కొంకితల ఆంజనేయ ప్రసాద్, చుండూరు శేఖర్, అల్లం రామ్మోహన్,రమణ కుమార్ అగస్త్య కృష్ణమోహన్ ఎంపీపీ గద్దె పుష్పరాణి, జ్యోతుల సత్యవేణి, మాదాసు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# యాడికిలో ఆధ్యాత్మిక ఉత్సవం

## -వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాల సమర్పణ





**యాడికి, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
ఆషాఢ మాస శుభ సందర్భంగా యాడికి మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతోంది. కాలనీల వారీగా భక్తులు భక్తిశ్రద్ధలతో, కన్నుల పండువగా పెద్దమ్మ తల్లికి బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం నాటి వేడుకల్లో భాగంగా ఆయా కాలనీల నుంచి ఏడు ప్రధాన బృందాలుగా విడిపోయిన వెయ్యి మందికి పైగా భక్తులు, మహిళలు నెత్తిన ఘటాలు, బోనాల కుండలతో భక్తిపారవశ్యంతో కదం తొక్కారు.శివ సత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, మంగళవాయిద్యాల మధ్య సాగిన ఈ ఊరేగింపుతో స్థానిక మైన్ బజార్ శోభాయమానంగా మారింది. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో పెద్దమ్మ గుడి కి వెళ్లే ప్రధాన వీధులన్నీ జనసంద్రంగా మారాయి. కాలు పెట్టేందుకు కూడా స్థలం లేనంతగా మైన్ బజార్ కిక్కిరిసిపోయినప్పటికీ, భక్తులు ఎంతో ఓర్పు, క్రమశిక్షణ పాటించారు. ఎలాంటి తొక్కిసలాటలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తులే స్వచ్ఛందంగా వరుస క్రమంలో నిలబడి అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఇదిలా ఉండగా, యాడికి గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం జరిగి దాదాపు పదేళ్లు పూర్తవుతోందని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఊరి సమృద్ధి కోసం, గ్రామాభివృద్ధి కోసం దేవర నిర్వహించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్దలు ఐక్యంగా ముందుకు వచ్చి మరోసారి పెద్దమ్మ తల్లి దేవరను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# పొగాకు రైతుల పక్షాన వైఎస్ఆర్సిపి పోరాటం

## వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామనాయుడు



**తాడేపల్లిగూడెం, ఆగస్టు 4 , నేటి శుభోదయ :**
పొగాకు రైతుల పక్షాన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పోరాటం చేస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి లో జగన్ బహిరంగ సభ సమావేశాన్ని పలువురు వైసీపీ నాయకులు పరిశీలించారు. మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలసిల రఘురాం, జిల్లా ఇంచార్జ్ గుడివాడ అమర్నాథ్, మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ మంత్రి చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణ, తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైసీపీ నాయకులు వడ్డీ రఘురాం నాయుడు బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డీ మాట్లాడుతూ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతుల పక్షాన పోరాడి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడం కోసం ఈ సభను నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. రైతులు ప్రజలు జగనన్నతో కలిసి అడుగులు వేస్తూ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా నుండి అధిక వేల సంఖ్యలో పాల్గొని సభను భారీ ఎత్తున జరిగేలా నాయకులు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

## - ఆగస్టు 17 యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

- జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ పిలుపు



**అనంతపురం, ఆగస్టు 4 , నేటి శుభోదయ :**
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ డెబ్బై ఏళ్లుగా పోరాడుతూ వచ్చిందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎ.పి.యు. డబ్ల్యూ.జే.) అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం ప్రెస్ క్లబ్ లో జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్ట్ 17న యూనియన్ 70 వ ఆవిర్భావ దినోత్సవం జిల్లాలో అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆగస్ట్ 30 వ తేదీ లోపు జిల్లా యూనియన్ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని, ఆ తర్వాత జిల్లా మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. త్వరలో అనంతపురం ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఆయూఫ్ మాట్లాడుతూ యూనియన్ సంస్థగతంగా బలోపేతం కావడానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టు సంక్షేమం హక్కుల సాధన కోసం ఏపీయూడబ్ల్యూజే 70 ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు యూనియన్ సభ్యులందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో ఐజేయూ సభ్యులు సనప రామకృష్ణ, ఐజేయు మాజీ సభ్యులు ప్రభాకర్ నాయుడు, మార్కండేయులు, జిల్లా ఉపాధ్యక్షులు లింగప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూలశెట్టి చలపతి, జిల్లా ట్రెజరర్ చౌడప్ప, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేంద్రనాథ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భూమి రెడ్డి, బాల రంగారెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమా మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** 25వ డివిజన్, ఏలూరు రోడ్డులో ది యంగ్ మెన్స్ ముస్లిం అసోసియేషన్ (లైబ్రరీ) ఆధ్వర్యంలో యువతకు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్, ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండాఉమామహేశ్వరరావు లు ప్రారంభించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి, యువతకు అత్యంత అవసరమని అన్నారు. ఉచితంగా నాణ్యమైన కంప్యూటర్ శిక్షణ అందించడం ద్వారా యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ శిక్షణ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.నిర్వాహకులు మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు, యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించి వారిని ఉపాధి దిశగా తీర్చిదిద్దడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి పోలీసుల దాడి - బెల్ట్ షాప్ లో 5 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

### -కేసు నమోదు



**విశాఖపట్నం, ఆగస్టు 05 , నేటి శుభోదయ :** మంగళవారం భీమిలి సి.ఐ దివాకర్ యాదవ్ ఆదేశాల మేరకు భీమిలి పోలీసులు బెల్ట్ షాప్ పై దాడి నిర్వహించారు.దాడిలో అక్రమంగా విక్రయిస్తున్న 5 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు.చేసి తదుపరి విచారణ చేపట్టారు.అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సి.ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఘనంగా వనమూలికా దినోత్సవం

- **ఆచార్య బాలకృష్ణ జన్మదిన వేడుకలు**
- **పలువురికి ఔషధ మొక్కల పంపిణీ**






**ఒంగోలు, ఆగస్టు 05, నేటి శుభోదయ :** పతంజలి యోగా వ్యవస్థాపకులలో ఒకరైన ఆచార్య బాలకృష్ణ జన్మదిన వేడుకలలో భాగంగా స్థానిక కేశవ స్వామి పేట, ప్రసన్న చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణములో ప్రతిరోజూ నిర్వహిస్తున్న యోగ శిక్షణ కార్యక్రమంలో ఆగస్టు 4న, మంగళవారం ఉదయం యోగ సాధకులకు ఔషధ మరియు దైవిక మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం మొక్కలను నాటారు.ప్రకాశం జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బోయపాటి రవిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం గంధవళ్ళ పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో సోమ సుబ్బారావు, వేమూరి చక్రధర పెరుమాళ్ళు, తాతా ప్రసాద్ తదితరులు పాల్గొని ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలుజి మాట్లాడుతూ హరిద్వార్ కేంద్రంగా యోగా, ఆయుర్వేద చికిత్సలను విస్తృతం చేయడంలో పతంజలి యోగపీఠ్ సహ-వ్యవస్థాపకులుగా ఉన్నారని, యోగా, ఆయుర్వేదం, సంస్కృత వేదాలపై వందలాది పుస్తకాలను, పరిశోధనా పత్రాలను రచించారని, అరుదైన గిరిజన మూలికలను గుర్తించి, ఆయుర్వేద మందుల తయారీకి మరియు ఆరోగ్య సంరక్షణకు విశేష కృషి చేశారని తెలిపారు. వారి జన్మదినోత్సవాన్ని వనమూలిక దినోత్సవం గా జరుపుకోవడం ఆనవాయితీ అని వివరించారు.

## గన్నవరం రైతు బజార్‌లో బీపీటీ సన్న బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రా

- **తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు బీపీటీ స్టీమ్ సన్న బియ్యం కిలో రూ.52, రా రైస్ రూ.50కే విక్రయిస్తారు : యార్లగడ్డ**
- **సంక్షేమంతో పాటు అభివృద్ధినీ సమాంతరంగా అమలు చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం: యార్లగడ్డ వెంకట్రావు**
- **పట్టిసీమ ద్వారా సాగునీరు అందించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు: ఎమ్మెల్యే**
- **చిక్కవరం చెరువు ఘటనపై నిర్లక్ష్యం సహించను.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: యార్లగడ్డ**



**గన్నవరం, ఆగస్టు 4, నేటి శుభోదయ :** సామాన్య ప్రజలకు నాణ్యమైన బీపీటీ సన్న బియ్యాన్ని తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం రైతు బజార్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని కిలో రూ.52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ.50కు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి నెలకు 10 కిలోల చొప్పున బియ్యం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గత 26 నెలలుగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పింఛన్ల పంపిణీ నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు ప్రజాప్రతినిధులే నేరుగా పాల్గొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రహదారులను పెద్దఎత్తున పునరుద్ధరిస్తున్నామని, ఇప్పటికే 70 నుంచి 80 శాతం రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా కొన్ని కీలక రహదారుల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా నీటి విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న చొరవ వల్లే రైతులకు ఉపశమనం లభించిందన్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని చెప్పారు. చిక్కవరం చెరువులో గతంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, అక్రమ మైనింగ్, చెరువుల భద్రత అంశాల్లో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి కేసుల నమోదులో జరిగిన జాప్యంపై కూడా అధికారులను ప్రశ్నించినట్లు తెలిపారు. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో సామాన్య కుటుంబాలకు ఉపశమనం కల్పించేందుకే ఈ ప్రత్యేక విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ఈ పథకం అమలులోకి వచ్చిందన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖలో 10 వేల ఉద్యోగ పదోన్నతులు కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్తంగా 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నామని చెప్పారు. రైతు బజార్‌లో ఇంకా ఖాళీగా ఉన్న స్థలాల్లో అదనపు దుకాణాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు సూచించినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, జనసేన పార్టీ సమన్వయకర్త చల్లమలశెట్టి రమేష్‌బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల పార్టీ అధ్యక్షులు గుడపాటి తులసీమోహన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బోడపాటి రవి, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మల్పూరి సాయి కళ్యాణి, టీడీపీ సీనియర్ నాయకులు దొంతు చిన్నా,బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కానూరి శేషు మాధవి, తిరువీధి నరేష్, జొన్నలగడ్డ సుధాకర్, గొంది నరేంద్ర, ఆళ్ళ వెంకట గోపాలకృష్ణ, కంభంపాటి లక్ష్మీ నరసమ్మ, మేడిపల్లి రమ, చిమటా రవివర్మ, యనమదల సతీష్ , మున్నా రామకృష్ణ, పరుచూరి నరేష్, పలగాని రాంబాబు, నల్లూరు వెంకట రత్నం, బస్వే సరిత, తాటిపాముల నాగయ్య, జాస్తి రేణుక,చల్లగుల్ల సందీప్, అన్నే హరికృష్ణ, బడుగు ఝాన్సీ, రామినీడు బసవపూర్ణయ్య, జాస్తి మురళి, చల్లగాలి సునీల్, సొంగ సంతోష్, మణిమాల వెంకట అప్పారావు, ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి, కాగితాల నాగరాజు, మోదుగుమూడి వేణు, బస్వే నాగప్రసాద్, కొసరాజు సాయి, తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి వేళల్లో నాకాబందీ

### -ప్రజలు పోలీసులకు సహకరించాలి...

- **సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు**





**విశాఖపట్నం,ఆగస్టు 4, నేటి శుభోదయ :** విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, డీసీపీ (క్రైమ్స్) లతా మాధురి పర్యవేక్షణలో, సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు ఆధ్వర్యంలో దువ్వాడ, గాజువాక మరియు స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో విస్తృత స్థాయిలో నాకాబందీ, వాహనాల తనిఖీలు మరియు నైట్ బీట్ నిర్వహించడం జరిగింది.నాకాబందీ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు దొంగిలించబడిన వాహనాల గుర్తింపు, నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. రాత్రి వేళల్లో అనవసరంగా సంచరిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించి పంపించడం జరిగింది.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో అత్యవసర అవసరం ఉంటే మాత్రమే బయటకు రావాలని, పోలీసులు నిర్వహించే తనిఖీలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ప్రజలకు ముఖ్య సూచనలు:– రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై సంచరించవద్దు.– వాహనదారులు తమ వద్ద ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సీ ), డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉంచుకోవాలి.– ఆధార్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డును వెంట ఉంచుకుని, పోలీసులు కోరిన వెంటనే చూపించాలి.– అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలి.– పోలీసుల తనిఖీలకు పూర్తి సహకారం అందించి, నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు భాగస్వాములు కావాలి. దువ్వాడ, గాజువాక మరియు స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను అరికట్టేందుకు ఇకపై కూడా నాకాబందీలు, వాహనాల తనిఖీలు మరియు నైట్ బీట్‌లను మరింత పటిష్టంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దువ్వాడ ఎస్.ఐ. లక్ష్మి , హెడ్ కానిస్టేబుల్ శ్రీ సురేష్ మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి పోలీసు శాఖకు సహకరించాలని సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు విజ్ఞప్తి చేశారు.సౌత్ క్రైమ్ బ్రాంచ్విశాఖపట్నం సిటీ..

# పారిశ్రామిక టౌన్ షిప్పుల అభివృద్ధి కి శ్రీకారం చుట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

- **జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద 20 పారిశ్రామిక నోడల్ లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**




**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** పార్లమెంట్ లో ఐదు సంవత్సరాలలో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద మొత్తం ప్రతిపాదనలు, ఆమోదించబడిన ప్రాజెక్టుల వివరాలను పార్లమెంట్ వేదికగా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి జితిన్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రయోజన వాహనాల ద్వారా, జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద పారిశ్రామిక టౌన్‌షిప్‌ల అభివృద్ధిని చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి కార్యకలాపాలలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం పారిశ్రామిక నోడ్‌లను గుర్తించడం, ఆ తర్వాత కాన్సెప్ట్ మాస్టర్ ప్లాన్, అభివృద్ధి ప్రణాళికను తయారు చేసి ఆమోదించడం, పర్యావరణ అనుమతి, వివరణాత్మక డిజైన్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నుండి పొందడం వంటివి ఉంటాయి. ఇవన్నీ ప్రాజెక్టును ఆమోదం కోసం పరిగణనలోకి తీసుకునే ముందు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా భూమి రూపంలో ఉండగా, భారత ప్రభుత్వ వాటా ఈక్విటీ/లేదా రుణ రూపంలో ఉంటుంది అని తెలిపారు. భారత ప్రభుత్వం NICDP కింద మొత్తం 20 పారిశ్రామిక నోడ్‌లను ఆమోదించింది. వీటిలో, గత 5 సంవత్సరాలలో 12 ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. ఈ ప్రాజెక్టుల రాష్ట్రాల వారీ వివరాలు అనుబంధం I లో ఉన్నాయి అని అన్నారు పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (DPIIT), నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డేవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (NICDIT)కు రూ. 16,172.95 కోట్ల నిధులను మంజూరు చేసి విడుదల చేసింది. NICDP కింద వివిధ పారిశ్రామిక నోడ్‌లు/ప్రాజెక్టుల అభివృద్ధిని చేపట్టేందుకు, NICDIT ప్రాజెక్ట్ SPVలకు అదనంగా రూ. 14,569.97 కోట్ల నిధులను విడుదల చేసింది అని తెలిపారు ఆమోదించబడిన ప్రాజెక్టుల కోసం NICDIT ద్వారా ప్రాజెక్ట్ SPVలకు విడుదల చేయబడిన నిధులకు సంబంధించిన వివరాలు అందించినట్లు తెలిపారు NICDP కింద ఆమోదించబడిన 20 ప్రాజెక్టులలో, నాలుగు ప్రాజెక్టులు పూర్తయ్యాయి అని తెలిపారు EPC కాంట్రాక్టర్‌ను నియమించిన వాస్తవ తేదీ నుండి ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి మొత్తం నిర్మాణ కాలపరిమితి 36-48 నెలలు. పారిశ్రామిక నగరం/నోడ్ పరిధిలోని రోడ్లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, విద్యుత్ పంపిణీతో సహా అంతర్గత ప్రధాన మౌలిక సదుపాయాలను, ఆయా ప్రాజెక్ట్ SPVలు నియమించిన EPC కాంట్రాక్టర్ల ద్వారా అమలు చేస్తారు. భారీ నీటి సరఫరా, విద్యుత్, టెలికాం, రోడ్ల వంటి బాహ్య అనుసంధాన మౌలిక సదుపాయాలను, PM గతి శక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (NMP) పోర్టల్‌లో సమగ్రంగా మ్యాప్ చేసి, పరిశీలించడం జరిగింది. రాష్ట్ర శాఖ/కేంద్ర ఏజెన్సీలతో సంప్రదించి, SHA/SSA నిబంధనల ప్రకారం సంబంధిత రాష్ట్ర SPVలు ఈ పనులను చేపట్టాయి.పూర్తయిన 04 ప్రాజెక్టులలో ఈ గుజరాత్ ధోలేరా ప్రత్యేక పెట్టుబడి ప్రాంతం (DSIR)మహారాష్ట్ర ప్రాంతం (SBIA) షెంద్రా-బిడ్కిన్ ఇండస్ట్రియల్, ఉత్తర ప్రదేశ్సమీకృత పారిశ్రామిక టౌన్‌షిప్ - గ్రేటర్ నోయిడా (ఐఐటి-జిఎన్)మధ్యప్రదేశ్ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ - విక్రమ్ ఉద్యోగపురి (IIT-VUL)మౌలిక సదుపాయాల భాగాలు అభివృద్ధి చేయబడ్డాయి రోడ్లు & సేవలు అడ్మినిస్ట్రేటివ్ భవనం వాటర్ సోర్సింగ్, ట్రాన్స్మిషన్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ మురుగునీరు ట్రీట్‌మెంట్ ప్లాంట్ సాధారణ మురుగునీటి శుద్ధి ప్లాంట్ శక్తి మౌలిక సదుపాయాలు సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ICT) సౌకర్యాలుఅమలును వేగవంతం చేయడానికి, ప్రాజెక్టుల సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకొనున్నట్లు మంత్రి తెలిపారు.ఒక అపెక్స్ పర్యవేక్షణ అథారిటీ, NICDIT కార్యకలాపాలను, పారిశ్రామిక కారిడార్ ప్రాజెక్టుల పురోగతిని క్రమానుగతంగా సమీక్షిస్తుంది.DPIIT, NICDIT ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు/సంబంధిత ఏజెన్సీలు/వాటాదారులతో కలిసి ఈ ప్రాజెక్టుల అభివృద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది.ప్రమాదాన్ని తగ్గించడానికి, భాగస్వాములు, సంబంధిత ఏజెన్సీలతో సమన్వయం ద్వారా అవసరమైన అన్ని నియంత్రణ, చట్టబద్ధమైన అనుమతులు సకాలంలో పొందబడతాయి అని అన్నారు. వివిధ స్థాయిలలో క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించి, అవసరమైన చోట విధానపరమైన చర్యలు తీసుకుంటారు.ప్రాజెక్ట్ అమలును వేగవంతం చేయడానికి, సకాలంలో పూర్తి చేయడానికి, అవసరమైన చోట అడ్డంకులను తొలగించడానికి ప్రగతి, పిఎమ్‌జి పోర్టల్‌లను ఉపయోగించుకుంటారని తెలిపారు.

## 9వ డివిజన్‌లో కొమ్మా సీతారామయ్య స్కూల్ ఆవరణలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్, కలెక్టర్ లక్ష్మీశ




**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారి హెల్త్ రిపోర్టును స్థిదం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. తూర్పులోని 9వ డివిజన్ పటమట లంకలోని కొమ్మా సీతారామయ్య స్కూల్ ఆవరణలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు(ఓరల్ డెంటల్ హెల్త్ పోగ్రామ్) మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని ఈ పరీక్షలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దంత సంరక్షణపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన ఏర్పరుచుకోవాలని చెప్పారు. శరీరంలోని అన్ని అవయవాలు ప్రధానమైనవేనని అయితే మనం నిత్యం ఆహారాన్ని తీసుకునేందుకు పళ్ళు చాలా అవసరమని చెప్పారు. పంటి నెప్పి ప్రారంభంలో అంత తీవ్రంగా ఉండకపోవడం వల్ల సమస్య చాలా పెద్దదిగా మారిన తర్వాతే దంత వైద్యులను సంప్రదిస్తున్నారని చెప్పారు. అలా కాకుండా ప్రతి ఆరు నెలలకు ఒక సారి దంత వైద్యుడిని సంప్రదించడం ద్వారా దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని చెప్పారు. పిల్లలకు దంత సంరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గతంలో వేప పుల్లలతో పళ్ళు తోముకునే వారమన్నారు. వేప పుల్ల పళ్ళకు మందుగా పనిచేసేందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి బ్రష్‌ను మార్చాలన్నారు. పిల్లలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఒక రిపోర్ట్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారని చెప్పారు. డాక్టర్ శ్రీధర్ ఎప్పటి నుంచే దంత వైద్యులుగా ఉంటూ ఎంతో మందికి ఉచితంగా దంత వైద్య సేవలను అందించారని గద్దె అన్నారు.జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీమయని అన్నారు. పిల్లలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నివేదిక రూపొందించడం ద్వారా వారికి భవిష్యత్తులో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, క్రాంతిశ్రీ, పొతంశెట్టి నాగేశ్వరరావు, నర్రా కిషోర్, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుల శ్రీదేవి, డీఈవో చంద్రకళ, ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, దంత వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఓ యువతి మూడు గ్రాముల చెవి దిద్దులు, సర్టిఫికెట్లతో కూడిన బ్యాగును ఆటోలో మరిచిపోయింది

- **బాధితురాలు టూటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, తక్షణమే స్పందించారు**
- **గంటల వ్యవధిలోనే ఆటోను గుర్తించి ఆమె బ్యాగును అందజేశారు.**



**విశాఖపట్నం, ఆగస్టు : 05, నేటి శుభోదయ :** వివరాల్లోకి వెళితే శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేఘన అనే యువతి హైదరాబాదులోని ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతుంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రైల్వేస్టేషన్ కు చేరుకున్న మేఘన శ్రీకాకుళం వెళ్ళుటకు ఇక్కడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కు వెళ్ళుటకు ఆటో ఎక్కారు. ఈ నేపథ్యంలో ఆమెతో తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మర్చిపోయారు. ఆందోళనకు చెందిన యువతి వెంటనే టూ టౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సీహెచ్. చిరంజీవరావు, హెడ్ కానిస్టేబుల్ ఎండి.హాఫీజ్జుల సీసీ కెమెరాలను పరిశీలించి ఆటోను గుర్తించారు. అనంతరం ఆటో డ్రైవర్ వద్ద బ్యాగును స్వాధీనం చేసుకొని, మేఘన కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవిరావు, హెడ్ కానిస్టేబుల్ హాఫీజ్జుల కృషిని అభినందిస్తూ మేఘన కృతజ్ఞతలు తెలిపారు.

## 8న శక్తి ఆధ్వర్యంలో మ్యూజికల్ మాషప్

- **సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం**
- **పోస్టర్ ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ**
- **విజయవంతం చేయాలని అధ్యక్షురాలు రజని పిలుపు**
- **శక్తి సేవలను ప్రశంసించిన జాతీయ, రాష్ట్ర నేతలు గంట్ల, కొంక్యాన**



**విశాఖపట్నం, ఆగస్టు : 05, నేటి శుభోదయ :** నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ) అందిస్తున్న సేవలు ప్రశ ంస నీయ మ ని పలువురు ప్రముఖులు కొనియాడారు... శక్తి.సంస్థ అధ్యక్షురాలు పైడి రజని ఆధ్వర్యంలో ఈ నెల 8న బీచ్‌రోడ్డులోని హోటల్ అంబికా సీగ్రీన్ లో సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగనున్న మ్యూజికల్ మాషప్ కార్యక్రమ పోస్టర్‌ను విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం స్థానిక వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. పేద పిల్లల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. శక్తి అధ్యక్షురాలు పైడి రజని మాట్లాడుతూ శక్తిసంస్థ స్థాపించిన ఏడేళ్లలో ఉత్తరాంధ్రలో విద్య, వైద్యం, సామాజిక కార్యక్రమాలు ఎన్నో నిర్వహించామని, శక్తి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మ్యూజికల్ డ్యాన్స్ ఫెర్మారెన్స్ ఈ నెల 8న హోటల్ అంబికా సీ గ్రీన్ లో సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహిస్తున్నామని, పాటలు, డ్యాన్స్, ఇతర కార్యక్రమాలకు నామమాత్రంగా వచ్చే రుసుంను నిరుపేద పిల్లలకు పుస్తకాలు, బట్టలు, చదువుకు ఉపయోగపడే రీతిలో సహాయమందిస్తామన్నారు. జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖపట్నంలో మనో వికాస కేంద్రాలు, శరణాలయాల్లో రజని ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, లెక్చరర్‌గా, స్కాలర్‌గా ఉంటూ సమాజహిత కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించిన శక్తి సంస్థ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. శక్తి సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘ నాయకులు ఎమ్మెస్సార్ ప్రసాద్ అభినందించారు. విలేకరుల సమావేశంలో శక్తి ప్రతినిధులు భువన, శైలజ, పద్మావతి, అలైఖ్య, కిరిటీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి శ్రీమతి -వి.అనిత



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** శ్రీ కనక దుర్గమ్మ వారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి శ్రీమతి వి.అనిత కుటుంబ స భ్యుల తో కలిసి మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు.ఇంద్రకీలాద్రికి విచ్చేసిన వీరిని ఆలయ అర్చకులు, ధర్మ కర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.శ్రీ అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, వేదాశీర్వచనం అందజేసారు. చైర్మన్ బొర్రా రాధా కృష్ణ, సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు,శ్రీమతి ఎస్. సరిత,ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## ద విద్యార్థికి అండగా బీజేపీ నేత కే,ఎన్,ఆర్...

- **స్కూల్ ఫీజు కోసం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు**



**విశాఖపట్నం, ఆగస్టు05, నేటి శుభోదయ :** విద్య అనేది ప్రతి పిల్లవాడి హక్కు అని, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ బాలబాలిక చదువుకు దూరం కాకూడదని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్ ) అన్నారు. ఈ నేపథ్యంలోనే గాజువాక జోగవానిపాలెంలో నివసిస్తున్న పేద విద్యార్థి కేశవ్ స్కూల్ ఫీజు కోసం రూ.5,000 ఆర్ధిక సహాయం అందించారు.వారి తండ్రి రమణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పదవతరగతి పాసైన తన కుమారుడు ఫీజు చెల్లించి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేని స్థితిలో రమణ ఉన్నాడని తెలుసుకున్న కేఎన్ఆర్ వెంటనే ప్రైవేటు స్కూల్ యాజమాన్యంతో స్వయంగా కలిసి మాట్లాడి కొంత ఫీజు తగ్గించమని అడిగారు. సానుకూలంగా స్పందించిన స్కూల్ వారు కూడ ఐదు వేల రూపాయల ఫీజు తగ్గించారని తండ్రి రమణ తెలిపారు. విద్యార్థి కేశవ్ కుటుంబ పరిస్థితిని గమనించిన కేఎన్ఆర్, వెంటనే స్పందించి ఈ సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "చదువుకు అవసరమైన సహాయం ఎవరి నుంచైనా అందాలి. ముఖ్యంగా పేద పిల్లల చదువులకు మనం అండగా నిలబడాలి" అని ఈ సందర్భంగా కేఎన్ఆర్ అన్నారు.రెండవ కుమారుడు సుశాంత్ ఫీజు కూడా గత ఆరు నెలలుగా కట్టలేని పరిస్థితిలో తండ్రి రమణ ఉన్నారని ఎవరైనా ధాతలు ఆయనకు సహాయం చేయాలని కోరారు. రమణ ఫోన్ నంబర్ 9491914127 కి ఫోను చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కొత్త గాజువాక బీజేపీ మండల అధ్యక్షులు ఒమ్మి రంగనాయకులు , మండల ఇంచార్జ్ బాటా శ్రీనివాస్, శ్రీను కార్యకర్తలు, విద్యార్థి కేశవ్ తల్లిదండ్రులు రమణ, సూర్య మణి, సోదరుడు సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జోగవానిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ కన్వీనర్ కే, ఎన్,ఆర్



**విశాఖపట్నం, ఆగస్టు 4, నేటి శుభోదయ :** విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గంలోని జోగవానిపాలెం అంగన్వాడీ కేంద్రాన్ని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగ రావు (కేఎన్ఆర్) సందర్శించారు. కేంద్రంలో పిల్లలకు అందుతున్న సేవలు, పోషకాహారం, పరిశుభ్రత, మౌలిక వసతుల పరిస్థితిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్య, పోషకాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పిల్లలకు పాలు , గుడ్లు, బాలామృతం వంటి నాణ్యమైన పోషకాహారం, గర్భిణులు మరియు బాలింతలకు అవసరమైన పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని అంగన్వాడీ టీచర్ అప్పలనర్సమ్మకి సూచించారు.కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, శుభ్రతను కాపాడడం, సిబ్బందికి అవసరమైన సహకారం అందించడం వంటి చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజాసేవలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఒమ్మి రంగ నాయకులు , మండల ఇంచార్జ్ బాటా శ్రీనివాసరావు,స్థానిక నాయకులు శ్రీను ,స్వామి ,అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., ఆదేశాలతో ..

- **నగర పరిధిలో గల స్క్రాప్ షాపులలో యెటువంటి అక్రమ కార్యకలాపాలు, ప్రమాదకరమైన కార్యకలాపాలు అండ్ నిర్లక్ష్యం తావు లేకుండా విస్తృత తనిఖీలు నిర్వహించిన నగర పోలీసులు**







**విశాఖపట్నం, ఆగస్టు : 05, నేటి శుభోదయ :** మంగళవారం మద్యాహ్నం నుండి సాయంత్రం వరకూ నగర వ్యాప్తంగా 288 స్క్రాప్ షాపులలో 65 టీం లతో సుమారు 200 మంది సిబ్బందితో తనిఖీలు చేపట్టడం జరిగినది.ఈ తనిఖీలలో ప్రధానముగా తనిఖీ చేసిన అంశాలు:సీసీటీవీ వివరాలు(i) సీసీటీవీ (సీసీటీవీ ) కెమెరాలు అమర్చబడి ఉన్నవీ/లేనిదీ?(ii) ఒకవేళ ఉంటే, ఎన్ని కెమెరాలు ఉన్నాయి?(iii) వాటి పనితీరు ఎలా ఉంది? (పనిచేస్తున్నాయి / పనిచేయడం లేదు) స్టోరేజ్ వివరాలు(i) సీసీటీవీ ఫుటేజ్ అక్కడే ఉన్న డీవీర్ లో నిల్వ చేయబడుతుందా లేదా రిమోట్ లోకేషన్‌లోనా?(ii) స్టోరేజ్ సామర్థ్యం ఎంత?(iii) ఎన్ని రోజుల ఫుటేజ్ నిల్వ ఉంటుంది?(iv) ఫుటేజ్ క్లౌడ్ (క్లౌడ్ )లో బ్యాకప్ చేయబడుతుందా/లేదా?బాలకార్మికులు మరియు వ్యాపార వివరాలుస్క్రాప్ షాపులో ఎవరైనా పిల్లలు పని చేస్తున్నారా? అవునుఎవరూ కనిపించలేదుఅనుమానంగా ఉందిస్క్రాప్ షాపులలోవ్యాపార రకం: రిటైల్ స్క్రాప్ (రిటైల్ స్క్రాప్ )బల్క్ యార్డ్ (బల్క యార్డ్ )డిస్మాంట్లర్ (డిస్మాంట్లర్ )వెహికల్ బ్రేకర్ (వెహికల్ బ్రేకర్ )ఈ–వేస్ట్ హ్యాండ్లర్ (ఈ – వేస్ట్ హేండిలర్ )రిజిస్ట్రేషన్ మరియు నిర్వహణట్రేడ్ లైసెన్స్ నంబర్ మరియు గడువు ఉన్నదీ/లేనిదీ?షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్ ఉన్నదీ/లేనిదీ?కొనుగోలు/అమ్మకాల రిజిస్టర్లు లేదా నగదు పుస్తకాలు (క్యాష్ బుక్స్ ) నిర్వహిస్తున్నదీ/లేనిదీ?డిజిటల్ పేమెంట్ వ్యవస్థ (యూపీ ఐ క్యూ ఆర్ కోడ్ /పి ఓ ఎస్ ) ఉన్నదీ/లేనిదీ?అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్సటింగుషేర్ ) ఉన్నదీ/లేనిదీ? ఉంటే, ఎన్ని ఉన్నాయి?వాహనాల తుక్కు మరియు నిబంధనలుషాప్ రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ (ఆర్ వి ఎస్ ఫ్ ) నా? (అంటే పరివాహన్ ' వి ఎస్సీ ఆర్ ఏపీ ' పోర్టల్ ద్వారా స్క్రాపింగ్ సర్టిఫికేట్లు జారీ చేయడానికి అధికారం ఉందా/లేదా)ఏవైనా పూర్తి వాహనాలు ఉన్నాయా? ఉంటే, వాటిని పరివాహన్ యాప్‌లో తనిఖీ చేయాలి?షాపులో అందుబాటులో ఉన్న ఆర్ సీ కి మరియు అక్కడ ఉన్న వాహనానికి మధ్య ఏదైనా తేడా ఉందా? నకిలీ నంబర్ ప్లేట్లు ఏవైనా ఉన్నాయా? అనధికారిక పార్కింగ్ ఉందా? (స్క్రాప్ షాపు వెలుపల రోడ్లపై) భారతీయ రైల్వేలు / స్టీల్ ప్లాంట్‌కు చెందిన రాగి తీగలు / ఇనుప రైలింగ్‌లు వంటి దొంగిలించబడిన వస్తువులు ఏవైనా దొరికాయా?మంగళవారం చేపట్టిన తనిఖీలలో సీజ్ చేయబడినవి:–భూగర్భ విద్యుత్ కేబుల్ – 62 కేజీలునీటి పంపులు (వాటర్ ట్యాప్‌లు) – 100ఎలక్ట్రికల్ వైర్ కాయిల్స్ – 14అల్యూమినియం హై–వోల్టేజ్ విద్యుత్ వైర్లు – 68 కేజీలుతెల్ల రాగి మరియు రాగి కేబుళ్లు – 30 కేజీలు పై సీజ్ చేసిన ఆస్తిని సంబంధిత క్రైమ్ పోలీస్ స్టేషన్లకు అప్పగించి, కేసులు రిజిస్టర్ చేయడం జరుగుతుంది, నగర పరిధిలో గల స్క్రాప్ షాపులలో యెటువంటి అక్రమ కార్యకలాపాలు, ప్రమాదకరమైన కార్యకలాపాలు అండ్ నిర్లక్ష్యాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని పోలీసు కమిషనర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఘనంగా మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు

## తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి, ప్రముఖ ప్రజానాయకుడు మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేశ్, సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, సాంస్కృతిక ప్రముఖులు, అధికారులు, ప్రజలు పాల్గొని ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలి వెంకటకృష్ణారావు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ప్రజాసేవను జీవిత ధ్యేయంగా ఎంచుకుని ప్రతి పదవికి విలువ తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తిత్వమని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ సేవలో, ప్రజానాయకుడిగా ప్రజా సంక్షేమంలో, పార్లమెంట్ సభ్యుడిగా, శాసనసభ్యుడిగా ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధిగా, విద్య, సాంస్కృతిక, సాంఘిక సంక్షేమ, మత్స్య, సహకార శాఖల మంత్రిగా అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. 1975లో నిర్వహించిన మొదటి ప్రపంచ తెలుగు మహాసభలకు ఆయన సారథ్యం వహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చారని, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పిన మహనీయుడిగా చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం అంతర్జాతీయ తెలుగు సంస్థ అధ్యక్షుడిగా 1981లో మలేషియాలో జరిగిన ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించి తెలుగు జాతి ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని అన్నారు.1977లో సంభవించిన దివిసీమ ఉప్పెన సమయంలో వేలాది బాధితులకు అండగా నిలిచి, సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించి, నిరాశ్రయుల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచారని తెలిపారు. ప్రజలు ప్రేమతో ఆయనను "దివిసీమ గాంధీ" అని పిలవడం ఆయన నిస్వార్థ సేవలకు నిదర్శనమని అన్నారు.ప్రజలే రాజకీయాల కేంద్రబిందువని విశ్వసించి, అధికారం కోసం కాదు – సేవ కోసం రాజకీయాలను వినియోగించిన అరుదైన మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు అని, ఆయన ఆశయాలు, సేవా తత్వం, విలువలతో కూడిన రాజకీయ జీవితం నేటి తరానికి, భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండలి వెంకటకృష్ణారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

# స్టాకింగ్ తీవ్రమైన నేరం

### -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పర్సన్ డా.రాయపాటి శైలజ





**అనంతపురం, ఆగస్టు 4, నేటి శుభోదయ :** నేటి సమాజంలో స్టాకింగ్ ( మహిళలపై వేధింపులు) నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా. శైలజ తెలిపారు. మంగళవారం ఎస్.కె.యు లోని ఇంజనీరింగ్ విభాగ సమావేశ మందిరంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల వేధింపు పై వేధింపులు మరియు స్టాకింగ్ ( మహిళల వేధింపు ) సైబర్ స్టాకింగ్ నివారణ అంశాలపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ శైలజ పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్ సుప్రజ , సీనియర్ ఏపీపీ ఎన్. సి. సంగీత, మానసిక నిపుణులు డా. సురేఖ, ఉమెన్ కమీషన్ సలహా దారులు సూయాజ్, ఐ సి డి ఎస్ పి డి సాజిదా బేగం , ఎస్ కే యు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు అలాగే పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ,మహిళా పలువురు పారిశ్రామి కవేత్తలు మహిళలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ స్టాకింగ్ గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా స్టాకింగ్ అంటే ఎవరి ఇష్టానికి వ్యతిరేకంగా అయినా, వారిని నిరంతరం వెంబడించడం, గమనించడం, లేదా వారి ప్రమేయం లేకుండా వారి వ్యక్తిగత జీవితంలోకి చొరబడడానికి ప్రయత్నించడాన్ని స్టాకింగ్ అంటారని ఇది చట్టరీత్యా ఒక తీవ్రమైన నేరం అని పేర్కొన్నారు.సమాజంలో చాలా మంది యువతులు మహిళలకు స్టాకింగ్ అంటే ఏమిటి అది ఏ ఏ రూపాల్లో జరుగుతుందో తెలియక వేధింపుల ను భరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి పదే పదే వెంబడించడం, వద్దని చెప్పిన ఆగకుండా మెసేజ్లు, ఫోన్ కాల్స్, గిఫ్టులు, లేఖలు పంపడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బంది పెట్టడం, ఫోన్ లేదా అకౌంట్లను హ్యాక్ చేయడం నకిలీ అకౌంట్లు సృష్టించి వేధించడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ కిందకే వస్తాయని వివరించారు.గతంలో ఎక్కువగా ఫిజికల్ స్టాకింగ్ ఉండేదని, ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ కేసులు వేగంగా జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు మొదట స్టాకింగ్ ను గుర్తించడం, ఆధారాలను భద్రపరచడం, వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిటిసి ప్రిన్సిపల్ సుప్రజ ఐ పి ఎస్ వివిధ కేస్ స్టడీ లను వివరించారు. వివాహిత మహిళలు కూడా స్టాకింగ్ గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్నిసార్లు ఈ వేధింపుల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి కావడం ఆత్మహత్యలకు కూడా దారి తీసిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అలాగే న్యాయవాదులు టాకింగ్ సంబంధించిన చట్టాలు ఫిర్యాదు చేస్తే అమలయ్య విధానాన్ని సీనియర్ ఏపీపీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డా . సురేఖ సైకియాట్రిస్ట్ మాట్లాడుతూ బాధితుల్లో ఏర్పడే మానసిక ప్రభావాలపై విద్యార్థినీలకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ ను కలిసి తన అనుభవాన్ని పంచు కుంటూ ట్రోమటైజ్ అయ్యానని చెప్పడం కార్యక్రమంలో అందర్నీ ఆలోచింపజేసింది. చివరిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ కార్యక్రమంలో సందేశమిస్తూ డిప్రెషన్, ఆందోళన భయం వంటి మానసిక సమస్యలకు దారి తీసే స్టాకింగ్ ను చిన్న విషయంగా తీసుకోకుండా ప్రారంభ దశలోనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు

యువతలో అవగాహన పెంపొందించడం ద్వారానే ఇలాంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చునని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి అనేక కార్యక్రమాలను రూపొందించి ప్రత్యేకంగా కార్యాచరణ కార్యక్రమాలు చేపట్టి క్షేత్రస్థాయిలో మహిళల భద్రత కోసం అవగాహన సదస్సులతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై చర్చించారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాకింగ్ మరియు సైబర్ స్టాకింగ్ నివారణ పై అవగాహన కల్పించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# ఏలూరులో మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన

**ఏలూరు, ఆగష్టు 04, నేటి శుభోదయ :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా సమీక్షా సమావేశం నిమిత్తం మంగళవారం ఏలూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆయనకు ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి శ్రీ రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి అధికారులతో చర్చించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. స్వాగతం పలికిన వారిలో జిల్లా టిడిపి అధ్యక్షులు, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) , జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి , జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ , ఉంగుటూరు ఎమ్మెల్యే పట్సమట్ల ధర్మరాజు , దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ , రాష్ట్ర వడ్డీల కార్పోరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి , జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) , జనసేన పార్టీ సీనియర్ నాయకులు నారా శేషు , పలువురు ఉన్నతాధికారులు, వివిధ హోదాల్లో ఉన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు ఉన్నారు.





# చూటూరు గ్రామంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించిన కూటమి నాయకులు

**చింతూరు, ఆగష్టు 04, నేటి శుభోదయ :** ముకునూరు పంచాయతీ పరిధిలోని చూటూరు గ్రామంలోని 355వ బూత్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, గత రెండు సంవత్సరాల్లో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన టిడిపి, జనసేన నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వానికి ప్రజలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జ్ ఓబిళ్లనేని నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మల్లెల వెంకటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జ్ సీలం తమ్మయ్య, బూత్ ఇంచార్జ్ కారం సత్యవతి, జట్పాటి అంజి పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు బేడే సతీష్, తీగల రవి, మల్లిపూడి సతీష్, పయ్యాల ప్రవీణ్, మిడియం రమణమ్మ, పోడియం నాగార్జున తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.



# ఓటరు జాబితా పారదర్శకంగా తయారు కావాలి

**చింతూరు, ఆగష్టు 04, నేటి శుభోదయ :** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా రూపొందేందుకు బీజేపీకి చెందిన బీఎల్ఓ ఏజెంట్లు చురుకుగా పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సరోజిని స్వప్న కుమారి, జిల్లా అధ్యక్షుడు బుల్లి కొండల దొర పిలుపునిచ్చారు. మంగళవారం చింతూరులో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మణ్ రాజు అధ్యక్షతన నిర్వహించిన బీఎల్ఓ ఏజెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలంటే ఓటరు జాబితాలో ఉన్న దొంగ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో చేర్చడం బీఎల్ఓల బాధ్యత అని పేర్కొన్నారు. ఓటరు జాబితా స్వచ్ఛంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు ప్రతి బీఎల్ఓ ఏజెంట్ క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని, పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు పాయం వెంకయ్య, డీవీఎస్ఎన్ రమణారెడ్డి, మండల ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నిత్యావసరాలు పంపిణిలో టీడీపీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్

**చింతూరు, ఆగష్టు 04, నేటి శుభోదయ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కల్లేరు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు నిర్వహించిన నిత్యావసర సరుకులు, కూరగాయల పంపిణీ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ ఖాన్ పాల్గొన్నారు.వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజల పరిస్థితిని పరిశీలించిన ఆయన, బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు నిరంతరం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు మరింత వేగవంతంగా కొనసాగాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వరద ప్రత్యేక అధికారి డా. అన్వేష్ (వెటర్నరీ వైద్యులు), తహసీల్దార్ అర్జున్ రావు, ఆర్ఐ విఘ్నేష్, చింతూరు వీఆర్వో రామ చంద్రతో పాటు ఇతర రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు



# "ప్రజాహితమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**స్వర్ణ తాడేపల్లిగూడెం, ఆగస్టు 4, నేటి శుభోదయ :** ప్రజాహితం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భారతీయులుగా ఆలోచించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేట గ్రామంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కారానికి అవసరమైన సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గన్నపేట గ్రామంలో ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.5–6 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామీణ రహదారులు, లింక్ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమైన 'వికసిత్ భారత్–2047' సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు . కులం, మతం కంటే మానవత్వం, భారతీయత ముఖ్యమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు కులాలకు అతీతంగా దేశం కోసం సేవలందిస్తున్న స్ఫూర్తిని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యారంగంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను నెలకొల్పే విధంగా నిరంతరం శ్రమిస్తూ,16 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన విద్యా శాఖ మంత్రి లోకేష్ ను రాజీనామా చేయాలనటం వైసిపి నీచ రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కోసం, దేశంలో ప్రథమ స్థానం సాధించేందుకు నిరంతరం కృషి జరుగుతుందని ఆయన అన్నారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి కీలక ప్రాజెక్టులు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారువైసిపి నేతలు ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడడం మానుకోవాలని హితవు పలికారు.జగన్ పాలనలో గ్రామీణ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు.ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. జనసేన,టిడిపి, వైసిపి అధినేత లను ఆయా సామాజిక వర్గాల ప్రజలు తమ నాయకులుగా చెప్పుకోవడం సహజమనిఅన్నారు. అంతకుమించి కులానికి ఎలాంటి ప్రాధాన్యత లేదని అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు కలిసి గెలిపిస్తేనే ఎవరైనా నాయకులు కాగలరని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రత్యేక అధికారి యు. శ్రీనివాస్ తహసిల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఇతర అధికారులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# శ్రీరంగపట్నంలో వైభవంగా శ్రీశ్రీశ్రీ మొదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలు...!



**కోరుకొండ, ఆగష్టు 04, నేటి శుభోదయ :** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో నిర్వహించిన శ్రీ మాతృశ్రీ మొదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా తెల్లవారు జామున నుంచి భక్తులు, మహిళలు, ఆడబడుచులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. తమ ముడుపుల, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి మహోత్సవాల్లో 'రూడా' చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఆయనకు ఆలయ కమిటీ నిర్వాహకులు, ఎన్డీయే కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట రమణ చౌదరి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు బొడ్డు వెంకటరమణ చౌదరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తనకాల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి మద్దాల అమ్మజి రమణ, ఉత్సవ కమిటీ కమిటీ అధ్యక్షుడు ఆళ్ల కృష్ణ, రాపేటి సూర్య చంద్రం, సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# గోరుకల్లు, అవుకు రిజర్వాయర్లు పరిశీలించిన అనంత

- రాయలసీమ లిఫ్ట్‌తో కరువు జిల్లాలకు ప్రయోజనకరం
- రేవంత్‌రెడ్డితో రహస్య ఒప్పందం చేసుకున్న చంద్రబాబు
- హంద్రీనీవాను 11 వేల క్యూసెక్కులకు పెంచాలి
- సీమకు ద్రోహం చేసి చరిత్రహీనులుగా మిగిలిపోవద్దు





**అనంతపురం, ఆగస్టు 4, నేటి శుభోదయ :**
నేటి శుభోదయరాయల సీమ సాగు నీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా నంద్యాల జిల్లాలోని గోరుకల్లు రిజర్వాయర్, అవుకు టన్నెల్, రిజర్వాయర్‌ను నంద్యాల జిల్లా వైసీపీ నేతలతో కలిసి పరిశీలించిన వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్ : రాయలసీమ అంటేనే కరువు ప్రాంతం. 1996లో చంద్రబాబు గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు శంకుస్థాపన మాత్రమే చేశారు. పనులను ముందుకు తీసుకెళ్లలేదు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో హంద్రీనీవా, గాలేరు–నగరి, వెలిగొండ పూర్తి చేసి ఉంటే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మేరకు మనకు నికర జలాలు అందేవి. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం అయ్యాకే సాగునీటి ప్రాజెక్టులు పరుగుపెట్టాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 44 వేల క్యూసెక్కులకు పెంచిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిది. వైఎస్ చలవతోనే హంద్రీనీవా పనులు శరవేగంగా సాగాయి. వైఎస్ఆర్ కృషితోనే 2012 నుంచి కృష్ణా జలాలు హంద్రీనీవా ద్వారా వస్తున్నాయి. హంద్రీనీవా తొలి దశ పనులతో పాటు రెండో దశలో 75 నుంచి 80 శాతం పనులు వైఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ప్రాజెక్టులను పట్టించుకోలేదు. హంద్రీనీవా, గాలేరు–నగరి, తెలుగు గంగ డిస్ట్రిబ్యూటరీలను పట్టించుకోలేదు. ఆయకట్టుకు నీరందించలేదు. ఈ రోజు హంద్రీనీవా కోసం వంద రోజుల్లో రూ.3800 కోట్లు ఖర్చు చేశామని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారు. తొలి దశ పనులను 3850 క్యూసెక్కులకు పెంచామని చెబుతున్నా వాస్తవానికి 2700 క్యూసెక్కులు కూడా రాలేదు. రెండో దశలో లైనింగ్ పేరుతో దోపిడీ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం వల్ల గ్రేటర్ రాయలసీమ జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుంది. కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చేసుకున్న రహస్య ఒప్పందం కారణంగా సీమ ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టుపెట్టారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 780 అడుగల నుంచి తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులకు నీళ్లను మళ్లిస్తోంది. అయినా చంద్రబాబుకు పట్టడం లేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తి అయితే మనం కూడా తక్కువ సమయంలో ఎక్కువ నీళ్లను తీసుకెళ్లవచ్చు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఎన్జీటీ అనుమతి లేదని చంద్రబాబు సాకులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి ఆయనకు లేదు.రాయలసీమలో పుట్టిన చంద్రబాబు రాజకీయంగా ఎంతో ఎదిగారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ ఆయన ఎప్పుడు సీఎంగా ఉన్నా సీమకు ద్రోహమే చేస్తున్నారు. తక్షణం రాయలసీమ లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు హంద్రీనీవాను 11 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలి. రాయలసీమలోని ప్రజాప్రతినిధులు కూడా తమ గళం విప్పి చంద్రబాబుపై ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో మీరంతా చరిత్రహీనులుగా నిలిచిపోతారు.

# మెగా డీఎస్సీ కాదు..! దగా డీఎస్సీ





**అనంతపురం, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
డీఎస్సీ–2025 అక్రమాలపై రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపి సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాస్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం అనంతపురం నగరం తపోవనం కూడలిలో జి పి ఆర్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్య నాయకులు, విద్యార్ధులు, యువత పాల్గొన్నారు.చంద్రబాబు సీఎం కాగానే తొలి సంతకం డీఎస్సీపై కాకుండా అవినీతిపై చేశారని విమర్శించారు. డీఎస్సీ–25లో జరిగిన అవినీతి, అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని, ఇందుకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నారా లోకేష్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని, ప్రభుత్వ మెడలు వంచి అర్హులైన నిరుపేద మెరిట్ విద్యార్ధులకు అండగా ఉంటామని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రికి పట్టిన గతే నారా లోకేష్‌కూ పడుతుందని వ్యాఖ్యానించారు.మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ అని ఆరోపించారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో ఫేక్ సర్టిఫికెట్లతో తమకు కావాల్సిన వారిని అందలం ఎక్కించారని, కోట్లాది రూపాయల స్కాం జరిగిందని ఆరోపించారు.1:1 నిష్పత్తిలో ఎంపికైన చాలామందికి ఉద్యోగాలు రాలేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ జాబితాలో 250 మంది ఉన్నారని తెలిపారు. విద్యార్థులు, యువత జీవితాలతో మంత్రి నారా లోకేష్ ఆడుకుంటున్నారని విమర్శించారు.గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ద్వారా శాశ్వత ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కేవలం 811 టీచర్ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు.811 పోస్టుల కోసం 50 వేలకు పైగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో మెరిట్ వచ్చిన వారికి కాకుండా కొందరు అనర్హులకు పోస్టులు కట్టబెట్టారని ఆరోపించారు.ఇంతటితో ఆగబోమని, నష్టపోయిన ప్రతి బాధితుడికి పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ నెల 6, 7, 8, 9 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని, నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దుతామని, అన్యాయానికి గురైన వారిలో చైతన్యం తీసుకొస్తామని అన్నారు. ప్రజల పక్షాన నిలిచిన వారి గొంతు నొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.చంద్రబాబు పాలన బ్రిటీష్ పరిపాలనకు తీసిపోని విధంగా సాగుతోందని విమర్శించారు. అందులో భాగంగానే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

# యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ట్రైనీ కలెక్టర్





**యాడికి, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ సుయాస్ కుమార్ ఐఏఎస్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను ఆయన కూలంకషంగా పరిశీలించారు.అనంతరం ఆశాడే సమావేశంలో పాల్గొని, ఆశా కార్యకర్తలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సి. శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పరమేశ్వర్, డాక్టర్ సాయి సుమంత్ రెడ్డిల ఆధ్వర్యంలో ఈ ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొని ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సోమవారం నుండి బుధవారం వరకు 'వెక్టర్ కంట్రోల్ హైజీన్ డ్రైవ్' నిర్వహించి, సమాచారాన్ని సెక్రటరీ లాగిన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నమోదైన సమస్యలన్నింటినీ బుధవారం లోగానే పరిష్కరించాలని (క్లోజ్ చేయాలని) స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలని, అలాగే ప్రతీ ఆరోగ్య కార్యకర్త తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రక్త పూతలు (బ్లడ్ స్మియర్స్) సేకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, పీహెచ్ఎన్ శోభాకుమారి, మెయిల్ సూపర్‌వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్ హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కలిసిన మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి

**అనంతపురం, ఆగస్టు 04, నేటి శుభోదయ :**
మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు పొందడం జరిగింది. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం వెలగపూడి లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి మార్కెట్ యార్డ్ సంబంధించిన విషయాల గురించి వివరించడం జరిగింది.ఈ సందర్భంగా అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.ఈ–నామ్ (ఈ నామ్ వ్యవస్థపై:ప్రస్తుతం అమలులో ఉన్న ఈ–నామ్ విధానం వల్ల రైతులు ఆశించిన స్థాయిలో ప్రయోజనం పొందడం లేదని, ఓపెన్ ఆక్షన్ విధానాన్ని అమలు చేస్తే రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయని వివరించడం జరిగింది. అలాగే, ఈ–నామ్ ద్వారా రైతులకు ఎంత ధర లభిస్తుందో కూడా స్పష్టత లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలియజేయగా, ముఖ్యమంత్రి స్పందిస్తూ, "ఈ అంశంపై వర్క్ అవుట్ చేయండి. రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థను కొందరు వేరే విధంగా ఉపయోగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి." అని అధికారులకు సూచించారు.2) జంబో ఫ్రూట్ షెడ్ నిర్మాణం:పండ్లను ఎండ, వర్షం నుంచి రక్షించి రైతులకు మెరుగైన ధరలు లభించేలా జంబో ఫ్రూట్ షెడ్ నిర్మించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.3) పాత గోదాముల తొలగింపు:ఖాళీగా ఉన్న శిథిలావస్థ గోదాములను తొలగించి పశువుల మార్కెట్‌కు అదనపు స్థలం అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించడం జరిగింది. 4) పాత మార్కెట్ యార్డ్ కార్యాలయం తొలగింపు:ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న కార్యాలయ భవనాన్ని తొలగించి, ఆ స్థలాన్ని వాణిజ్య సముదాయం నిర్మాణానికి వినియోగించాలని కోరడం జరిగింది.5) కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం:పీపీపీ విధానంలో సుమారు 50 దుకాణాలతో వాణిజ్య సముదాయం నిర్మించి ఉపాధి అవకాశాలు పెంపొందించాలనే ప్రతిపాదనను వివరించడం జరిగింది.6) నూతన మార్కెట్ యార్డ్ కార్యాలయం అభివృద్ధి:ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న కార్యాలయాన్ని ఆర్‌సీసీ భవనం పై అంతస్తుకు తరలించి, ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, సమావేశ మందిరం వంటి ఆధునిక వసతులతో నూతన కార్యాలయంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించడం జరిగింది.7) సి.సి. డ్రెయిన్ నిర్మాణం:పశువుల మార్కెట్‌లో మురుగు నీటి పారుదల కోసం సి.సి. డ్రెయిన్ నిర్మించి పరిశుభ్రతను మెరుగుపరచాలని కోరడం జరిగింది.8) ప్రహరీ గోడ నిర్మాణం:మార్కెట్ యార్డ్ పశ్చిమ వైపున కొత్త ప్రహరీ గోడ నిర్మించి భద్రతను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ సందర్భంగా అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా పీపీపీ విధానంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా దుకాణాల ఏర్పాటు ప్రతిపాదనను అభినందిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్థానిక రాజకీయ పరిస్థితులు పలు ముఖ్యమైన అంశాలపై చర్చించడం జరిగింది.



# ఘనంగా ఏపీ నిట్ 8వ స్నాతకోత్సవం

**తాడేపల్లిగూడెం, ఆగస్టు 4 , నేటి శుభోదయ :**
నూతన విక్షిత్ భారత్‌ను నిర్మించేందుకు తయారీ రంగంలోని అవకాశాలపై దృష్టి పెట్టాలని ఐ లాబ్స్ గ్రూప్ చైర్మన్ చింతలపాటి శ్రీనివాసరాజు సూచించారు. జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఎన్ఐటీ) ఆంధ్రప్రదేశ్ లో విద్యనభ్యసించిన 2022–26 బ్యాచ్ విద్యార్థులకు 8వ స్నాతకోత్సవ వేడుకలను డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని రవీంద్ర కళా భారతి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన ఐ లాబ్స్ గ్రూప్ చైర్మన్ చింతలపాటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంతో పాటు వారి ఉన్నతకి అవసరమైన లోకజ్ఞానాన్ని అందించేవి విద్యాలయాలేనని, ప్రతి విద్యార్థి ఎదుగుదలలో గురువుల భాగస్వామ్యం తప్పని సరిగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు దేశం గర్వించేలా వినూత్న పరిశోధనలు, ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆయా రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని చెప్పారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త కొత్త సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్నాయని, వాటిలో మెలకువలు నేర్చుకుని పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలను సులువుగా అధిరోహించవచ్చని తెలిపారు. ఏ దేశ ఆర్థిక వ్యవస్థకైనా ఆయువుపట్టు యువతరమేనని, దేశ గతిని, స్థితిని మార్చే సత్తా నవతరానికే ఉందని తెలిపారు. జీవితంలో ప్రతిక్షణం ఎంతో విలువైనదని, నిత్య అన్వేషిగా రోజు ఏదొక విషయాన్ని నేర్చుకోవటంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని సూచించారు. జీవితంలో చిత్తశుద్ధి అనేది అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. చదువులో రాణించాలనే తపన, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందడుగు వేస్తే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని చెప్పారు. యువత తమలోని శక్తియుక్తులను వెలికితీసి కాలానికి అనుగుణంగా తగిన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రతి విమర్శను సమర్థవంతంగా, సానుకూలంగా ఎదుర్కొని వాటిని భవిష్యత్తుకు మెట్టుగా మలుచుకోవలన్నారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని చెప్పారు. చదువు, సేవా కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మికంగానూ ఎదగాలని తెలిపారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తమవంతు భాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎన్ఐటి ఆంద్రప్రదేశ్ లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానం, నైపుణ్యాలు వారి జీవితంలో ముందడుగు వేయడానికి ఎంతగానో దోహదపడతాయని వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఐఐటీ తిరుపతి డైరెక్టర్, ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ మాట్లాడుతూ స్నాతకోత్సవం అనేది కేవలం డిగ్రీ అందుకునే కార్యక్రమం మాత్రమే కాదని, విద్యార్థి జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలికే మైలురాయని తెలిపారు. ఈ డిగ్రీ వారి కృషి, క్రమశిక్షణ, జిజ్ఞాస, పట్టుదలకు నిదర్శనమని చెప్పారు. కొత్త నైపుణ్యాలను అలవరచుకోవడం, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని పెంపొందించుకోవాలని పట్టభద్రులకు సూచించారు. భారతదేశం తయారీ, అంతరిక్షం, పునరుత్పాదక ఇంధనం, అర్థవాహకాలు, నూతన ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచ నాయకత్వం దిశగా అడుగులు వేస్తోందని, ఈ ప్రయాణంలో యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులో వైద్య సాంకేతికత, స్థిరమైన ఇంధన పరిష్కారాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యా, పాలనకు ఉపయోగపడే డిజిటల్ సాధనాల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేయాలని కోరారు. విజయవంతమైన జీవితానికి ఐదు ముఖ్య సూత్రాలను కూడా ఆయన వివరించారు. ప్రతి రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం, అపజయాలను అధిగమించే ధైర్యాన్ని అలవరచుకోవడం, సహకార భావంతో పనిచేయడం, సమాజ సేవను జీవిత లక్ష్యంగా చేసుకోవడం ద్వారా గొప్ప విజయాలు సాధించవచ్చని తెలిపారు. భవిష్యత్తుపై సందిగ్ధత సహజమేనని, అయితే ధైర్యం, నిరంతర కృషి, విలువలతో కూడిన జీవన విధానం ప్రతి విద్యార్థిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందని వివరించారు. అధ్యక్షత వహించిన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ 2026 బ్యాచ్‌కు చెందిన బీటెక్, పీహెచ్‌డీ పట్టభద్రులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల త్యాగం, అధ్యాపకుల అంకితభావం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చింతలపాటి శ్రీనివాసరాజుకు, గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణకు సంస్థ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రేరణాత్మక సందేశాలు పట్టభద్రులకు భవిష్యత్తులో మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ పదేళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని మరో మైలురాయివైపు అడుగులు వేస్తోందని చెప్పారు. విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమలతో భాగస్వామ్యం, సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో సంస్థ విశేష పురోగతి సాధించిందని చెప్పారు.ఈ స్నాతకోత్సవంలో 644 మంది బీటెక్, 53 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయడం సంస్థ అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు. దేశ నిర్మాణంలో తమ జ్ఞానం, నైపుణ్యాలను వినియోగించి సమాజానికి సేవ చేయాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. సంస్థ ప్రతిష్ఠను చాటుతూ జాతీయ స్థాయిలో ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్ విశిష్ట గుర్తింపు పొందుతోందని ఆయన తెలిపారు. జాతీయ సంస్థల శ్రేణీకరణలో 2025 సంవత్సరానికి ఇంజినీరింగ్ విభాగంలో 201–300 ర్యాంక్ సాధించగా, భారతీయ విద్యా సంస్థల శ్రేణీకరణ 2026లో దేశ వ్యాప్తంగా 66వ ర్యాంక్, రాష్ట్రంలో 3వ ర్యాంక్ దక్కడం గర్వకారణమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.411.20 కోట్ల వ్యయంతో తొలి దశ మౌలిక వసతుల నిర్మాణం పూర్తి చేసుకుందని తెలిపారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు, విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యా వాతావరణం కల్పించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులు, పురస్కారాలు సాధించడం సంస్థకు మరింత ప్రతిష్ఠ తీసుకువచ్చిందని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతూ, జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యా సంస్థగా ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్‌ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు పిలుపునిచ్చారు. పరిశోధనలు, ప్రాజెక్టులు, ఎంఓయూలు, స్పోర్ట్స్, గేట్ ఎగ్జామ్స్, ప్లేస్మెంట్స్, స్టూడెండ్స్ క్లబ్స్, గ్రంధాలయం, విద్యార్థులు, ఆచార్యులు సాధించిన ప్రగతి నివేదికను అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డీన్ అకడమిక్ డాక్టర్ ఎన్.జయరామ్ ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం 2022–26 బ్యాచ్ లో నాలుగేళ్ళ ఇంజినీరింగ్ కోర్సును పూర్తిచేసుకున్న 664 మంది బీటెక్ విద్యార్థులకు డిగ్రీలు, పిహెచ్డి పూర్తి చేసుకున్న 53 మంది పరిశోధన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రధానం చేశారు. వీరితోపాటు కోర్సులవారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన 8 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ (బంగారు పతకాలు) అందజేశారు. బ్యాచ్ లో అందరికంటే ఎక్కువ గ్రేడ్ పాయింట్లు సాదించిన విద్యార్థిని సమయమంతుల అవ్యక్త ఇనిస్టిట్యూట్ తరఫున, కోర్సువారీగాను రెండు బంగారు పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, డాక్టర్ హిమబిందు, సెనేట్ సభ్యులు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ చెల్లింపులతోనే సౌలభ్యం



**పులిచెర్ల, ఆగష్టు 4, నేటి శుభోదయ :**
విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని కల్లూరు విద్యుత్ శాఖ ఏఈ పురుషోత్తం వినియోగ దారుల కు సూచించారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏపీఎస్పీడీసీఎల్ ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, బీబీపీఎస్ యాప్‌లు, మీ సేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, ఇతర నెట్ సెంటర్ల ద్వారా బిల్లులు చెల్లించే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు.ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ఆలస్య రుసుము భారం తప్పడంతో పాటు వినియోగదారుల విలువైన సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఇకపై కల్లూరు విద్యుత్ ఉపకేంద్రం వద్దగానీ, గ్రామాల్లో ఏర్పాటు చేసే బిల్లుల వసూళ్ల కౌంటర్లను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులందరూ డిజిటల్ చెల్లింపు విధానాన్ని వినియోగించి సకాలంలో బిల్లులు చెల్లించాలని ఏఈ పురుషోత్తం కోరారు.

# వాహనాలకు డాక్యుమెంట్స్ సక్రమంగా ఉండాలి

**: సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్**



**చింతూరు, నేటి శుభోదయ :**
ఆటోలు, మ్యాజిక్ లకు సంబంధించి అన్ని డాక్యుమెంట్స్ సి బుక్కు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్ తదితర వాహనానికి రికార్డులు సక్రమంగా ఉండాలని లేనిచో కేసులు తప్పవని చింతూరు సిఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు.ఈ మేరకు చట్టి, చింతూరు గ్రామాల్లో ఆటో, మేజిక్ యూనియన్ డ్రైవర్లు, యజమానులతో, అవగాహన కల్పించారు. వాహనాలు అధిక స్పీడుతో నడపరాదని, అలాగే పరిమితికి మించి ప్యాసింజర్ ఎక్కించకూడదని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళలను గౌరవించాలని ఉద్బోధించారు. ఆటోలు, మేజిక్ లు గాని రోడ్డుకు ఒక పక్కన వరుసక్రమంలో నిలుపుదల చేయాలని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. డ్యూటీలో ఉన్నప్పుడు డ్రైవర్లు యూనిఫారం ధరించి, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ,ఎస్ఐ లతో పాటు ఆటో యూనియన్, నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

# 10న మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జైల్ భరో

**ఏలూరు, ఆగష్టు 04, నేటి శుభోదయ :**
కేంద్ర మోడీ ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 10వ తేదీన జిల్లాలో జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు,రైతుసంఘం,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెప్పారు. మంగళవారం ఏలూరులోని ఉద్దరాజు రామం భవనంలో జైల్ భరో కరపత్రాలను ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి ఎన్ వి డి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడారు. ఆగస్టు 9 క్విట్ ఇండియా డే స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం పరిరక్షణ కోసం, కార్మిక రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జైల్ భరో కార్యక్రమం జరుగుతున్నదని వివరించారు. కేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదులకు లొంగిపోయి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నదని ఈ ఒప్పందం భారత రైతాంగానికి తీవ్ర నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ,అదాని లాంటి కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్నాయని, అందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. మరోవైపు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లు తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించి వేశారని విమర్శించారు. రైతుల కోరుతున్న మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావడం లేదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈనెల 10వ తేదీన జరుగుతున్న జైల్ భరో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ లింగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు జి. రాజు, నారపల్లి రమణారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్,మహంకాళి రావు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ కనకదుర్గమ్మ వారికి ఆషాఢ సారెను సమర్పించిన నాయి బ్రాహ్మణ వర్కర్స్ యూనియన్



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :**
శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కేశఖండనశాల నాయి బ్రాహ్మణ వర్కర్స్ యూనియన్ వారు మంగళవారం శ్రీ కనకదుర్గమ్మ వారి ఆషాడ మాస సారె కార్యక్రమాన్ని ఆలయ ఈవో దంపతులు, ధర్మకర్తల మండలి చైర్మన్& సభ్యులు చేతులు మీదగా నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులందరూ పాల్గొని శ్రీ అమ్మవారికి సారె ను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ ఆలయాల జే.ఏ.సీ అధ్యక్షులు గుంటుపల్లి రామదాసు, ఎజిఎల్.నారాయణ, ఆర్ వి.రమణ, జి.హరి కిరణ్,ఎ.పూర్ణ కనకారావు, P.సంతోష్, ఎ.రాంబాబు, ఆర్. రమణ, జి.సంతోష్, కే.కిషోర్, కే. సిద్దయ్య, వై.సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మండలి వెంకటకృష్ణారావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** శ్రీ మండలి వెంకటకృష్ణారావు ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద మాజీ మంత్రి, ప్రముఖ ప్రజానాయకుడు, తెలుగు భాషా–సంస్కృతి పరిరక్షకుడు శ్రీ మండలి వెంకటకృష్ణారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, శ్రీ మండలి వెంకటకృష్ణారావు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జీవితాంతం పనిచేసిన దూరదృష్టి గల నాయకుడని కొనియాడారు. విద్యా వికాసం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పరిపాలనలో విలువలు, ప్రజల పట్ల అంకితభావం, నిస్వార్థ సేవ ఆయన జీవితానికి ప్రతీకలని పేర్కొన్నారు.

## ఎస్సీ బాయ్స్ హాస్టల్ భవనాన్ని నిర్మించండి



**కాకినాడ, ఆగష్టు 04, నేటి శుభోదయ :** జగ్గంపేట నియోజకవర్గంలోని జగ్గంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులకు అనుకూలంగా లేకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం హాస్టల్‌ను తాత్కాలికంగా వేరే ప్రాంతానికి మార్చారు. పాత ఎస్సీ బాయ్స్ హాస్టల్ ఉన్న స్థలంలోనే నూతన హాస్టల్ భవనాన్ని నిర్మించాలని బహుజన సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేస్తున్నారు.పాత హాస్టల్ స్థలం విద్యార్థులకు సౌకర్యవంతమైన ప్రాంతంలో ఉండటంతో పాటు ప్రభుత్వానికి ఇప్పటికే అందుబాటులో ఉన్న స్థలం కావడం వల్ల అక్కడే కొత్త భవనం నిర్మిస్తే విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించవచ్చని ఆయన తెలిపారు. జగ్గంపేట ఎస్సీ బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయినా సరే హాస్టల్ నిర్మాణానికి కాలయాపన చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పాత హాస్టల్ ఉన్న స్థలంలో కాకుండా వేరే స్థలంలో నిర్మించడానికి కూటమి ప్రభుత్వ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని నాగేశ్వరరావు అన్నారు. ఎందుచేతనంటే జగ్గంపేట నడిబొడ్డున దళితుల పిల్లలు ఉండకూడదనే దురుద్దేశంతో ఈ ప్రయత్నం చేస్తున్నారు.పాత హాస్టల్ స్థలంలోనే ఆధునిక సౌకర్యాలతో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులను ఆయన కోరారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో మహిళా భక్తుల రద్దీ



**విజయవాడ, ఆగష్టు 04, నేటి శుభోదయ :** శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రి పై ఆషాఢ సారె 21వ రోజు మంగళ వారం శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా భక్తులతో రద్దీ పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 39 సారె బృందాలు రాగా 16921 మంది భక్తులు సారె ను సమర్పించారు.సారె బృందాలకు ఉచిత దర్శనంతో పాటు, వేద పండితులు వేదాశీర్వచనం, లడ్డు ప్రసాదాలను అందజేశారు.చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్ సారె బృందాలతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం అజైల్ సెక్యూరిటీ ఏజెన్సీకి ఈఓ సీనా నాయక్ తీవ్ర హెచ్చరిక; భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తే సహించేది లేదు



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానం ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో దేవస్థానం ఈఓ సీనా నాయక్ అజైల్ సెక్యూరిటీ ఏజెన్సీ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, భక్తుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది ప్రవర్తనపై వచ్చిన పలు ఫిర్యాదులపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ సదరు ఏజెన్సీకి కఠిన హెచ్చరికలు జారీ చేశారు.దుర్గమ్మను దర్శించుకోవడానికి వచ్చే భక్తుల గౌరవానికి, భద్రతకు, సౌకర్యాలకు ఎలాంటి భంగం వాటిల్లినా సహించేది లేదని ఈఓ స్పష్టం చేశారు. విధుల్లో ఉంటూ సెక్యూరిటీ సిబ్బంది సెల్ ఫోన్లలో మునిగిపోతే ఎంతమాత్రం ఉపేక్షించబోము. ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని తక్షణమే విధుల్లోంచి తొలగిస్తాము. సెక్యూరిటీ సిబ్బంది దృష్టంతా కేవలం భక్తుల క్రమబద్ధీకరణ, భద్రతపైనే ఉండాలి. భక్తుల పట్ల సెక్యూరిటీ గార్డులు అత్యంత మర్యాదగా, సహనంతో నడుచుకోవాలి. భక్తులతో అసభ్యంగా మాట్లాడినా, దురుసుగా ప్రవర్తించినా, నెట్టివేసినా సదరు సిబ్బందిని వెంటనే సదరు సెక్యూరిటీ ఉద్యోగం నుండి తీసి వేస్తామని, ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడేందుకు, ఇంద్రకీలాద్రికి వచ్చే భక్తులకు సెక్యూరిటీ సిబ్బంది తప్పనిసరిగా "జై భవానీ" అంటూ సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలకాలి. ఆలయ పార్కింగ్ ప్రాంతాలలో వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఈఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్కింగ్ ఇబ్బందులను వెంటనే సరిదిద్ది, భక్తుల వాహనాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని అజైల్ ఏజెన్సీని ఆదేశించారు.వ్యక్తిగత బాధ్యత – తక్షణ తొలగింపు ఈఓ శ్రీ సీనా నాయక్ భద్రతా సిబ్బందికి సంబంధించి కొత్త జవాబుదారీ విధానాన్ని ప్రకటించారు. ఇకపై కేవలం ఏజెన్సీకి జరిమానా వేయడమే కాకుండా.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లేదా భక్తుల పట్ల తప్పుగా ప్రవర్తించిన ఏ సెక్యూరిటీ గార్డునైనా సరే, స్పాట్‌లోనే విధుల్లోంచి శాశ్వతంగా తొలగిస్తామని హెచ్చరించారు. ప్రతిరోజు సెక్యూరిటీ సిబ్బందిని డ్యూటీలు మార్చి డ్యూటీ చార్ట్ తన ముందు ప్రవేశపెట్టవలసిందిగా ఈవో ఆదేశించారు.అజైల్ సెక్యూరిటీ ఏజెన్సీ తమ సిబ్బంది ప్రవర్తనను తక్షణమే మార్చాలని, నిబంధనలు పాటించని పక్షంలో ఏజెన్సీపై భారీ జరిమానాలతో పాటు కాంట్రాక్ట్‌ను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని ఈఓ హెచ్చరించారు.

## అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో ద్విస్వర్ణ పతకాల విజేత ఉప్పాల కోటేశ్వరరావును అభినందించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉదయం తన ఛాంబర్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ ఉప్పాల కోటేశ్వరరావును ఘనంగా అభినందించారు.కృష్ణలంకలోని పద్మావతి ఘాట్ వద్ద గల సచివాలయం లో వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఉప్పాల కోటేశ్వరరావు ఈ నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లోని లక్ష్మి గార్డెన్స్, చంపాపేటలో నిర్వహించిన 2వ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపి-యన్‌షిప్లో పాల్గొన్నారు.ఈ నెల 2న జరిగిన పోటీల్లో కాటా విభాగంలో స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు, మొత్తం ఛాంపి-యన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌షిప్ కప్ ను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ విశేష ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు. అంతర్జాతీయ వేదికపై విజయవాడ నగరపాలక సంస్థకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, అభినందనలు తెలిపారు.

## రాజగోపాలచారి మార్కెట్ స్థలానికి రెండు వారాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** రాజగోపాలచారి మార్కెట్ స్థలానికి రెండు వారాల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా గాంధీనగర్, గొల్లపూడి బైపాస్, హెచ్.బి. కాలనీ ప్రాంతాలను సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా గాంధీనగర్‌లో ఇటీవల కూల్చివేసిన రాజగోపాలచారి మార్కెట్ స్థలాన్ని పరిశీలించి, ఆ స్థలం ప్రజలకు ఉపయోగపడేలా ఉండటంతో పాటు నగరపాలక సంస్థకు స్థిరమైన ఆదాయం సమకూర్చే విధంగా సమగ్ర ప్రాజెక్టు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్, అంచనాలు, కార్యాచరణతో కూడిన నివేదికను రెండు వారాల్లోగా సమర్పించాలని సూచించారు. అలాగే, ప్రస్తుతం అక్కడ ఉన్న శిథిలాలను పూర్తిగా తొలగించి, స్థలాన్ని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తదుపరి గొల్లపూడి బైపాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న డ్రైన్ బాక్స్ కల్వర్టు పనులను పరిశీలించి, పనులను వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం హెచ్.బి. కాలనీలోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. క్యాంటీన్‌లో పారిశుధ్య నిర్వహణ, సమయపాలన, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ ప్రజల అభిప్రాయాలను సేకరించి, వారి సూచనలకు అనుగుణంగా సేవల్లో అవసరమైన మార్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యాంటీన్ నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డి. హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** క్రీడా మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బందర్ రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియాన్ని సందర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించారు. స్టేడియంలోని జిమ్, ఇండోర్ క్రీడా విభాగాలు, బ్యాడ్మింటన్ కోర్టులు, స్కేటింగ్ రింక్, వాష్‌రూమ్‌లు తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, యువతకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిమ్‌లోని పరికరాలను ఎప్పటికప్పుడు నిర్వహణలో ఉంచి వినియోగానికి అనువుగా ఉండేలా చూడాలని సూచించారు. బ్యాడ్మింటన్ కోర్టులు, స్కేటింగ్ రింక్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పరిశుభ్రంగా, సురక్షితంగా నిర్వహించాలని, వాష్‌రూమ్‌లలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.స్టేడియం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, క్రీడాకారులు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ సూచించారు.ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి సత్యకుమారి, పర్యవేక్షణ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) కె. దుష్యంత్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, ఎస్ ఎఫ్ ఓ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ లో నాలుగు వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు గుర్తింపు ఏ.పి.కి ఐదేళ్లలో రూ.56.11 కోట్ల కేంద్ర సాయం




**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** పార్లమెంట్ లో దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో పరిశ్రమల భాగస్వామ్యం, విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణ, ఆధునిక పాఠ్యాంశాల అమలు, కేంద్రం అందిస్తున్న నిధుల వివరాలపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి సమగ్ర లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.దేశవ్యాప్తంగా వ్యవసాయ విద్యను జాతీయ విద్యా విధానం (NEP–2020)కు అనుగుణంగా ఆధునీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పరిశ్రమలతో అనుసంధానమైన ఇంటర్న్‌షిప్‌లు, సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల పరస్పర మార్పిడి, పరిశ్రమల అవసరాలకు తగ్గట్లుగా పాఠ్యాంశాల రూపకల్పన వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని వెల్లడించారు.దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య ఇప్పటికే 1,902 అవగాహన ఒప్పందాలు అమలులో ఉన్నాయని కేంద్ర మంత్రి భగీరథ్ చౌదరి వెల్లడించారు. వీటి ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన అవకాశాలు, పరిశ్రమల్లో ప్రత్యక్ష అనుభవం లభిస్తోందని వివరించారు.దేశంలోని 80 వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో 6వ డీన్స్ కమిటీ సిఫార్సులు అమలవుతున్నాయని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (గుంటూరు), డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ కూడా ఉండటం రాష్ట్రానికి విశేష ప్రాధాన్యం దక్కినట్లుగా నిలిచింది.వ్యవసాయ విద్యా సంస్థల్లో ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా నాణ్యత పెంపు కోసం గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.56.11 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు మంత్రి భగీరథ్ చౌదరి వెల్లడించారు. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా రూ.1,679.13 కోట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు.ఈ చర్యల ఫలితంగా విద్యార్థుల్లో నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, పరిశోధన ఫలితాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది.

# అనారోగ్య బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు 67.74.344 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రజల కష్టాల్లో ప్రభుత్వం అండగా ఉండాలనే ఆలోచన తో అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) అపదలో ఉన్న కుటుంబాలకు భరోసా గా మారి ఆ కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తున్నాయి.విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడ పార్లమెంట్ పరిధిలోని విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలతో పాటు తిరువూరు నియోజకవర్గం, గంపలగూడెం, విస్సన్నపేట, ఏ కొండూరు,ప్రాంతాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.67.74.344 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్(మెడికల్ రియంబర్స్మెంట్) ఎల్ ఓ సి చెక్కులు ఎంపీ చిన్ని ఆదేశాల మేరకు ఎంపీ కార్యాలయం ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రీ సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కన్నీటి పర్యంతమయ్యారు .ఆపద సమయంలో ప్రభుత్వం నుండి ఈ సాయం అందడంతో తమకు ఎంతో సంతోషాన్నిచ్చింది అని లబ్ధిదారులు తెలిపారు ఎంపీ చిన్ని కార్యాలయానికి వచ్చి తమకు వైద్య సహాయం చేయాలని కోరిన వెంటనే కార్యాలయ సిబ్బందిని ఆదేశించి త్వరిత గతిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించినఎంపీ కేశినేని చిన్ని కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, లీగల్ సెల్ నాయకులు ఎర్నేని వేదవ్యాస్, శాప్ డైరెక్టర్ సంతోష్, జిల్లా అధికార ప్రతినిధి రేగళ్ల లక్ష్మణరావు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాల మాధవ,34వ డివిజన్ అధ్యక్షుడు కొండ, టిడిపి సీనియర్ నాయకులు అబిద్, అబ్బూరి శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గమ్మ వారికి బంగారు హారం విరాళంగా అందజేత



**విజయవాడ, ఆగస్టు 4, నేటి శుభోదయ :** శ్రీ కనకదుర్గమ్మ వారికి కర్నూలు జిల్లా కు చెందిన వెంకటేశ్వరరావు రాజేశ్వరి దంపతులు సుమారు 3,88,000/– విలువైన బంగారు హారాన్ని ఆలయ పర్యవేక్షకులు, అర్చకులు సమక్షంలో అందజేసారు. దాతకు రసీదును అందజేసారు. ఈ సందర్భంగా దాతకు శ్రీ అమ్మవారి దర్శనం చేయించి, వేద పండితులు, వేదాశీర్వచనం అందజేసి,శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

# తమదైన ప్రత్యేక శైలితో ప్రార్థనా మందిరాల అభివృద్ధి

- **నేడు అంగరంగ వైభవంగా వార్షికోత్సవ సంబరాలు**
- **హాజరుకానున్న రాష్ట్ర మంత్రి ఎండి ఫరూక్, డాక్టర్ ప్రిస్కిల్లారూబెన్ మార్క్, రాయలసీమ బిషప్ డాక్టర్ పి. ఐజక్ వరప్రసాదరావు**




**నంద్యాల, ఆగస్టు 4, నేటి శుభోదయ :** లోక రక్షకుడైన ఏసుప్రభు చూపిన మార్గంలో నంద్యాల సి.ఎస్.ఐ డైసిస్ లో ఆధ్యాత్మిక వెలుగులు పంచుతూ తమదైన ప్రత్యేక శైలితో నంద్యాల పీఠాధిపతి డాక్టర్ కె సంతోష్ ప్రసన్న రావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. నూతన ఒరవడితో ప్రార్థనా మందిరాలను అభివృద్ధి చేస్తూ, ప్రజా ఉపయోగ నిర్మాణాలను చేపట్టి పీఠాధిపతి డాక్టర్ కె సంతోష్ ప్రసన్నరావు రెండో వసంతంలోకి తమ ఆధ్యాత్మిక గమనాన్ని కొనసాగిస్తున్నారు. సామ్యుడిగా, అందరినీ కలుపుకొనిపోయే విశాల దృక్పథం గల మత గురువు ప్రసన్నరావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు విశ్వాసుల్లో చైతన్యాన్ని నింపుతున్నాయి. బిషప్ డాక్టర్ కే సంతోష్ ప్రసన్న రావు తాను నంద్యాల డైసిస్ లో పీఠాధిపతిగా అయిన సంవత్సరకాలంలోనే ఊహించలేని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి ఆధ్యాత్మిక నిర్మాణాలను పూర్తిచేసి అందరిచేత ప్రశంసలు అందుకుంటున్నారు. నంద్యాల అధ్యక్ష మండల పరిధిలో ఒక ఏడాదిలో 18 ఆధ్యాత్మిక నిర్మాణాలకు పునాది రాళ్లు వేసి వీటిలో 10 ప్రార్థన మందిరాలను పూర్తి చేసి ఆధ్యాత్మిక సేవలు కొనసాగేలా చురుకుగా కృషి చేశారు. వీటితోపాటు రెండు మతగురువుల గృహాలు, అదితి గృహం, సండే స్కూల్, షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానున్నాయి. ఒక సంవత్సరం కాలంలోనే అద్వితీయంగా నిర్ణయాలు తీసుకొని ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణాలను సత్వరమే పూర్తిచేసి ప్రారంభోత్సవాలు నిర్వహించటం బిషప్ ఆధ్యాత్మిక సేవలు పట్ల సర్వత్ర అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మొదటి ఆధ్యాత్మిక వసంతాన్ని సంపూర్ణంగా విజయవంతం చేసి బిషప్ డాక్టర్ కే సంతోష్ ప్రసన్నరావు బుధవారం మొదటి వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బిషప్ రెవరెండ్ డాక్టర్ కె సంతోష్ ప్రసన్నరావు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయి. నంద్యాల డైసిస్ లోని ఎగ్జిక్యూటివ్ కమిటీ, డైసిస్ పరిధిలోని నంద్యాల, కర్నూలు, ప్రకాశం, కడప, అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లాల మత గురువులు, విశ్వాసులు, బిషప్ డాక్టర్ కే సంతోష్ ప్రసన్నరావు కు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. విశాల దృక్పథంతో దైవ సేవలు అందిస్తున్న బిషప్ కు ఆయన సతీమణి జాస్మిన్ బ్యూలా, కుమారులు డానియల్, న్యూ ఎల్ పురుషోత్తం, తల్లిదండ్రులు సీయోను పురుషోత్తం, పరిపూర్ణమ్మ, ఐదుగురు సోదరీమణులు వెన్నుదన్నుగా బిషప్ ను మహోన్నత స్థానంలో నిలిపేలా కృషి చేస్తున్నారు.

**నేడు నంద్యాల బిషప్ డాక్టర్ కె సంతోష్ ప్రసన్న రావు వార్షికోత్సవ సంబురం**

నంద్యాల పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి తొలి వసంతం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా బుధవారం నంద్యాలలోని హోలీ క్రాస్ క్యాథడ్రల్ చర్చి లో తొలి వసంత వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నహాలు పూర్తి చేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండి ఫరూక్, సినాడ్ సి ఎస్ ఐ మోడరేటర్ సతీమణి డాక్టర్ ప్రిస్కిలా రూబెన్ మార్క్, రాయలసీమ బిషప్ డాక్టర్ ఐజక్ వరప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వీరితోపాటు సినాడ్ ఉమెన్ ఫెలోషిప్ బాధ్యులు భారతి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, కమిషనర్, బండి శేషన్న హాజరవుతున్నారు. ఈ వేడుకలకు రాజేంద్ర బాబు, ప్రభుదాస్, . డాక్టర్ నందం ఇసాక్, ఎం స్టీవెన్, బండి సామెల్ ల పర్యవేక్షణలో నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి విజయవంతం చేసేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. ఈ వేడుకలకు నంద్యాల, ప్రొద్దుటూరు, గుంతకల్లు, నడికుడి, బాడవల్, కలసపాడు, గిద్దలూరు, అల్లగాడు, , కర్నూలు, ప్రకాశం, కడప, అనంతపురం, తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల ప్రాంతాల నుంచి 85 ఫాస్ట్రేట్ లోని 102 మంది పాస్టర్లు, 8 మిషనరీలు , 10 సువార్తికులు, నలుగురు బైబిల్ అమ్మగారితోపాటు పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరవుతున్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .